

'రాజముద్ర' తెలుగు దినపత్రికలో
ప్రకటనల కోసం సంప్రదించగలరు
సెల్ : 9182 474 575

అక్షర
# రాజముద్ర
www.rajamudranews.com
ప్రతి అక్షరం - ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
AKSHARA RAJAMUDHRA
RNI No: TELTEL/2024/86684

| మేడ్చల్-మల్కాజ్‌గిరి | శనివారం | 06.06.2026 | సంపుటి: 3 | సంచిక: 124 | పేజీలు : 8 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| MEDCHAL-MALKAJGIRI | SATURDAY | 06.06.2026 | VOLUME : 3 | ISSUE : 124 | PAGES: 8 | COST: 2/- |

## విలేకరులు కావలెను
'రాజముద్ర' తెలుగు దినపత్రికలో పని చేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషలో ప్రావీణ్యం, ప్రజా సమస్యలపై పోరాట స్ఫూర్తి, సమస్యలపై గళమెత్తగల వ్యక్తిత్వం, కలంతో ప్రశ్నించే ధైర్యం ఉన్నవారికి ఆహ్వానం పలుకుతోంది.
సంప్రదించాల్సిన చిరునామా..
సెల్ : 9182 474 575



## పాలమూరు వెనుకబాటుతనానికి గత
# ప్రభుత్వమే కారణం

- పాలమూరు ప్రజల రుణం తీర్చుకుంటానన్న సీఎం రేవంత్
- ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల కమిషన్లు తిన్నారని ఆరోపణ
- భూసేకరణ లేకుండా ప్రాజెక్టులు ఎలా పూర్తవుతాయని ప్రశ్న
- రెండేళ్లలో పెండింగ్ ఇరిగేషన్ పనులు పూర్తి చేస్తామని హామీ

2



### పాలమూరు ప్రాజెక్టులపై ప్రత్యేక ఫోకస్

- పెండింగ్ పనుల పూర్తి కోసం సీఎం కార్యాచరణ
- గూడెందొడ్డిలో 15 టీఎంసీల నీటి నిల్వకు కర్ణాటకతో చర్చలు

2

# కాంగ్రెస్ హామీలే అస్త్రం..

## దీర్ఘకాల పోరాటానికి బీఆర్ఎస్ వ్యూహం?

- డిక్లరేషన్ల అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయాలని ప్రణాళిక
- ఆరు నెలలకో ప్రధాన సభ నిర్వహించే దిశగా ఆలోచనలు
- రైతు డిక్లరేషన్ తర్వాత యూత్, బీసీ డిక్లరేషన్లపై ఫోకస్
- ఎన్నికల వరకు పోరాటాల జోరు కొనసాగించాలన్న లక్ష్యం




**హైదరాబాద్, జూన్ 5(రాజముద్ర న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, గ్యారంటీల అమలుపై ప్రజా పోరాటాలను దశలవారీగా నిర్వహించేందుకు బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉండటంతో పోరాట కార్యక్రమాలను ఒకేసారి కాకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు తీసుకెళ్లాలని పార్టీ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది.
ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన వివిధ డిక్లరేషన్ల అమలును ప్రధాన అంశంగా తీసుకుని ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టాలన్నది బీఆర్ఎస్ ఆలోచనగా చెబుతున్నారు. హామీలు అమలు కాలేదనే విషయాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం ద్వారా రాజకీయంగా లబ్ధి పొందాలని పార్టీ ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇటీవల వరంగల్‌లో నిర్వహించిన రైతు డిక్లరేషన్ సభకు పార్టీ నుంచి మంచి స్పందన లభించిందని బీఆర్ఎస్ నాయకత్వం భావిస్తున్నట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ప్రకటించిన రైతు డిక్లరేషన్ అంశాన్నే అక్కడ ప్రధానంగా ప్రస్తావిస్తూ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ వర్కింగ్

మిగతా 2వ పేజీలో..

# రెన్యువల్‌పై టెన్షన్..

## కాంగ్రెస్ కార్పొరేషన్ చైర్మన్లలో ఉత్కంఠ

- జులైతో ముగియనున్న 37 మంది చైర్మన్ల పదవీకాలం
- రెన్యువల్ కోసం పాతవాళ్లు.. అవకాశాల కోసం కొత్తవాళ్ల ప్రయత్నాలు
- పని తీరుపై సీఎం అసంతృప్తి ప్రభావం చూపే అవకాశం
- ఇంటెలిజెన్స్ నివేదికల ఆధారంగా నిర్ణయాలు ?

2





## ప్రజలకు ఉపాధి కల్పనే
# నిజమైన అభివృద్ధి

- 200 మంది మహిళలకు ప్రత్యక్ష ఉపాధి కల్పన
- సిద్దిపేటను దేశంలో రెండో షోలాపూర్‌గా తీర్చిదిద్దే అవకాశం
- దుస్తుల తయారీ పరిశ్రమను ప్రారంభించిన హరీశ్ రావు

3

## రూ.1600 కోట్ల విలువ చేసే
# బొగ్గు మాయం

- ఇప్పటివరకు అధికారులు తనిఖీలు చేయలేదు
- కాంగ్రెస్ వచ్చిన నాటి నుంచి సింగరేణిలో వరుస స్కామ్‌లు
- స్టాక్ యార్డుల్లో వుండాల్సిన బొగ్గు ఏమయింది?
- నిజం నిగ్గు తేల్చకపోతే సమ్మె తప్పదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరిక
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి లేఖ



**హైదరాబాద్, జూన్ 5 (రాజముద్ర న్యూస్):** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణి వరుస కుంభకోణాలకు కేరాఫ్ గా మారింది.. నైని కుంభకోణం

మిగతా 3వ పేజీలో..

## ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు



- ఆ స్థలాల్లో మహిళలకు వాటా కల్పిస్తాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

**హైదరాబాద్, జూన్ 5 (రాజముద్ర న్యూస్):** పేదల జీవనోపాధికి ఏమాత్రం ఇబ్బంది లేకుండా నియోజక వర్గాన్ని యూనిట్‌గా తీసుకుని క్యూర్ పరిధిలో పేదలు నివాసముంటున్న ప్రాంతాలకు సమీపంలోనే అల్పదాయ, మధ్యతరగతి వర్గాలకు

మిగతా 2వ పేజీలో..



## అధికారుల నిర్లక్ష్యమే కారణం

- అమీర్‌పేట్ అగ్నిప్రమాద బాధితులను పరామర్శించిన కవిత
- ముందే ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదన్న వ్యాపారులు


2

## రూ.30 వేల కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

- పుప్పాలగూడ–ఖాజాగూడలో హైడ్రా భారీ ఆపరేషన్
- 200 ఎకరాల ప్రభుత్వ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు
- ఆక్రమణలకు అడ్డుకట్ట వేసిన హైడ్రా
- చారిత్రక రాతిగుట్టలు, సహజ వనరుల పరిరక్షణకు చర్యలు
- హైకోర్టు ఆదేశాలతో క్షేత్రస్థాయిలో పరిశీలనలు


**హైదరాబాద్, జూన్ 5 (రాజముద్ర న్యూస్):** ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా చేపట్టిన ప్రత్యేక చర్యల్లో భాగంగా రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ–ఖాజాగూడ సరిహద్దులోని సుమారు 200 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించింది. సుమారు రూ.30 వేల కోట్ల విలువైన ఈ భూమికి ఫెన్సింగ్ ఏర్పాటు చేసి ఆక్రమణలకు అవకాశం లేకుండా చర్యలు చేపట్టింది.
హైకోర్టు ఆదేశాల మేరకు రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులతో కలిసి హైడ్రా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించారు. గతంలో

మిగతా 2వ పేజీలో..



## గండిపేట భూకబ్జా కుట్ర కేసులో అరెస్ట్

- ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మ నాయుడు అదుపులోకి
- ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నం
- నకిలీ జీవోలు, తప్పుడు రెవెన్యూ రికార్డులు సృష్టించినట్లు ఆరోపణలు
- కీలక పత్రాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు



3



## నిధులు, నియామకాలు,
# నీళ్లలో విఫలం

- బీఆర్ఎస్ బాటలోనే కాంగ్రెస్ ప్రభుత్వం
- పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు

3

## ఆహార భద్రత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

- అంగన్‌వాడీల్లో నాణ్యమైన ఆహారం అందించడమే లక్ష్యం
- మంత్రి ఆదేశాలతో సిబ్బందికి రేపు ప్రత్యేక శిక్షణ



3

## పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తాం: డీజీపీ సీవీ ఆనంద్

3

# కాంగ్రెస్ హామీలే అస్త్రం..

**మొదటిపేజీ తరువాయి**

ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు హాజరయ్యారు.

రైతు డిక్లరేషన్ తర్వాత యూత్ డిక్లరేషన్ అంశంపై ఉద్యమ కార్యక్రమాలు చేపట్టాలని తొలుత భావించినప్పటికీ, ప్రస్తుతం ఆ కార్యక్రమాన్ని వాయిదా వేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వరుసగా అన్ని అంశాలను ఉపయోగించడం కంటే ఎన్నికల వరకు వాటిని దశలవారీగా వినియోగించడం మంచిదనే అభిప్రాయానికి పార్టీ నాయకత్వం వచ్చినట్లు సమాచారం.

ఒక డిక్లరేషన్‌పై నిర్వహించే పోరాట సభకు, మరో అంశంపై చేపట్టే కార్యక్రమానికి మధ్య తగినంత వ్యవధి ఉండేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. రైతు డిక్లరేషన్ అంశాన్ని కొంతకాలం ప్రజల్లో చర్చనీయాంశంగా ఉంచిన తర్వాత యూత్ డిక్లరేషన్, అనంతరం బీసీ డిక్లరేషన్ వంటి అంశాలను ముందుకు తీసుకురావాలని ఆలోచిస్తున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి.

ప్రతిపక్షంగా ప్రభుత్వంపై నిరంతర ఒత్తిడి కొనసాగించేందుకు అందుబాటులో ఉన్న రాజకీయ అంశాలను సమయానుకూలంగా వినియోగించాలన్నదే బీఆర్‌ఎస్ లక్ష్యంగా కనిపిస్తోంది. ఎన్నికల వరకు ఆరు నెలలకోసారి పెద్ద ఎత్తున సభలు, పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజల్లో చర్చను కొనసాగించాలనే దిశగా పార్టీ అడుగులు వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

# రెన్యువల్‌పై టెన్షన్..

## కాంగ్రెస్ కార్పొరేషన్ చైర్మన్లలో ఉత్కంఠ

**హైదరాబాద్, జూన్ 5:**

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వివిధ కార్పొరేషన్లకు నియమితులైన 37 మంది చైర్మన్ల పదవీకాలం జులై నెలతో ముగియనుండటంతో పార్టీలో ఆసక్తికర చర్చ సాగుతోంది. ఒకవైపు ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారు మరో అవకాశం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తుండగా, మరోవైపు కొత్త నాయకులు పదవులపై ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తున్నారు.

2023 అసెంబ్లీ ఎన్నికల అనంతరం సీట్లు త్యాగం చేసిన నేతలు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులకు ప్రభుత్వం కార్పొరేషన్ చైర్మన్ పదవులు కేటాయించింది. ఇప్పుడు వారి పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో రెన్యువల్ ఉంటుందా లేదా అనే అంశం చర్చనీయాంశంగా మారింది.

కార్పొరేషన్ చైర్మన్ల పనితీరుపై సీఎం రేవంత్ రెడ్డి పలుమార్లు అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. చాలా మంది పార్టీ కార్యక్రమాలకు తగిన సమయం కేటాయించడం లేదనే అభిప్రాయం కూడా నాయకత్వంలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో అందరికీ రెన్యువల్ అవకాశం ఉండకపోవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల TSAT, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ పదవులను ప్రభుత్వం పొడిగించడంతో మిగతా చైర్మన్లలో కూడా ఆశలు చిగురించినట్లు తెలుస్తోంది. తమ పదవులు కూడా కొనసాగుతాయనే నమ్మకంతో కొందరు ఉన్నప్పటికీ, మరి కొందరు తీవ్ర ఆందోళనలో ఉన్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

కొన్ని కీలక సంస్థల చైర్మన్లకు మాత్రం పదవీకాల పొడిగింపు లభించే అవకాశం ఉందనే చర్చ సాగుతోంది. కాంగ్రెస్ సీనియర్ నేత జగ్గారెడ్డి భార్య నిర్మలా జగ్గారెడ్డిని TGIIC చైర్మన్‌గా కొనసాగించే అవకాశాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే స్పోర్ట్స్ అథారిటీ, ఎస్సీ కార్పొరేషన్, ఫిషరీస్ కార్పొరేషన్ వంటి కొన్ని సంస్థల్లోనూ రెన్యువల్ అవకాశాలపై చర్చ నడుస్తోంది.

ఇప్పటికే పదవీకాలం ముగియనున్న చైర్మన్లలో పలువురికి ఇంటెలిజెన్స్ విభాగం నుంచి వివరాలు కోరినట్లు ప్రచారం జరుగుతోంది. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కీలక పదవుల నియామకాల సందర్భంగా పోలీసు, ఇంటెలిజెన్స్ నివేదికలకు ప్రాధాన్యం ఇస్తుండగా, ఇప్పుడు రెన్యువల్ విషయంలో కూడా అదే విధానం అనుసరించే అవకాశం ఉందని సమాచారం.

పదవీకాలం ముగిసే సమయం దగ్గరపడుతుండటంతో ప్రస్తుతం పదవుల్లో ఉన్నవారు మరో అవకాశం కోసం పార్టీ పెద్దలను కలుస్తుండగా, కొత్తగా పదవులు ఆశిస్తున్న నాయకులు కూడా తమ ప్రయత్నాలను ముమ్మరం చేసినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. దీంతో కాంగ్రెస్‌లో కార్పొరేషన్ చైర్మన్ పదవుల వ్యవహారం ఆసక్తికరంగా మారింది.



# అధికారుల నిర్లక్ష్యమే కారణం: కవిత

**హైదరాబాద్, జూన్ 5:**

అమీర్‌పేట్‌లోని మైత్రివనం ఎదురుగా ఇటీవల అగ్నిప్రమాదానికి గురైన షాపింగ్ కాంప్లెక్స్‌ను తెలంగాణ రక్షణ సేన అధినేత కల్వకుంట్ల కవిత సందర్శించారు. ప్రమాదంలో నష్టపోయిన వ్యాపారులను పరామర్శించి వారి సమస్యలను తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ భవనంలో ప్రమాద సూచనలు కనిపిస్తున్నాయని గత కొంతకాలంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదులు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని కవితకు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన కవిత, ఈ అగ్నిప్రమాదం అనూహ్యంగా జరిగిన ఘటన కాదని పేర్కొన్నారు.

భవనం వెనుక భాగంలో ఉన్న మెస్ కారణంగా గతంలో కూడా షార్ట్‌సర్క్యూట్ ఘటనలు చోటుచేసుకున్నట్లు బాధితులు తెలిపారని ఆమె చెప్పారు. అగ్నిప్రమాదం సంభవించే అవకాశం ఉందని మూడు నెలలుగా అధికారులకు సమాచారం ఇచ్చినా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు.

అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందని కవిత విమర్శించారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.3 నుంచి 4 కోట్ల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనాలు ఉన్నాయని తెలిపారు. వ్యాపారులు తీవ్రంగా నష్టపోయారని, అనేక కుటుంబాలు ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు.

అగ్నిప్రమాదం జరిగిన తర్వాత కూడా అగ్నిమాపక వాహనాలు గంటకు పైగా ఆలస్యంగా చేరుకోవడం బాధాకరమని అన్నారు. సరైన సమయంలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ఉంటే నష్టం మరింత తగ్గే అవకాశముండేదని పేర్కొన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదానికి గురైన దుకాణాల యజమానుల వద్ద అన్ని అనుమతులు, నిరభ్యంతర ధ్రువపత్రాలు ఉన్నాయని కవిత తెలిపారు. నష్టపోయిన వ్యాపారులకు ప్రభుత్వం తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరారు. నగరంలోని వాణిజ్య సముదాయాలు, భారీ భవనాల్లో క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలని, ప్రజల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఉండకూడదని కవిత స్పష్టం చేశారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే అంశమని పేర్కొన్నారు.

# పాలమూరు వెనుకబాటుతనానికి గత ప్రభుత్వమే కారణం

**మహబూబ్‌నగర్, జూన్ 5:**

మహబూబ్‌నగర్ జిల్లా కరివేనలో నిర్వహించిన మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లాలోని సాగునీరు, ఇరిగేషన్ ప్రాజెక్టుల పరిస్థితిపై కీలక వ్యాఖ్యలు చేశారు. జిల్లా వ్యాప్తంగా రెండు రోజుల పాటు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహించామని, పాలమూరు భవిష్యత్తు కోసం తీసుకోవాల్సిన నిర్ణయాలను త్వరలో ప్రకటిస్తామని తెలిపారు.

**పాలమూరు ప్రజలకు రుణపడి ఉన్నా**

2009లో కష్టకాలంలో తనను ఆదరించి మహబూబ్‌నగర్ ఎంపీగా గెలిపించిన పాలమూరు ప్రజలను ఎప్పటికీ మరువలేనని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తాను ఎంపీగా ఉన్న సమయంలోనే కాంగ్రెస్ తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిందన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిందని, ఈ అంశాన్ని గతంలో చట్టసభల్లో కూడా ప్రస్తావించినట్లు గుర్తు చేశారు. జెడ్పీటీసీ సభ్యుడి స్థాయి నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు జిల్లాలోని ప్రతి ప్రాంతాన్ని సందర్శించానని, ఇక్కడి సమస్యలపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు.

**కమిషన్ల కోసం ప్రాజెక్టులు**

గత ప్రభుత్వం ఇరిగేషన్ ప్రాజెక్టుల పేరుతో రూ.1.81 లక్షల కోట్లు ఖర్చు చేసిందని, అందులో రూ.27 వేల కోట్లు పంపు లిఫ్టులకే కేటాయించి భారీ కమిషన్లు పొందిందని ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు అత్యంత కీలకమైందని, 90 టీఎంసీల నీటిని వినియోగించే సామర్థ్యం దీనికి ఉందన్నారు. కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులన్నింటికంటే ఇది పెద్దదని పేర్కొన్నారు. ఇవన్నీ సక్రమంగా పూర్తయి ఉంటే జిల్లాలో 26 లక్షల ఎకరాలకు సాగునీరు అందేదన్నారు.

ప్రాజెక్టుల కోసం అవసరమైన భూసేకరణ కూడా చేయలేదని, కాల్వలు, రిజర్వాయర్ల నిర్మాణానికి భూములు సేకరించకుండా పనులు ఎలా పూర్తవుతాయని ప్రశ్నించారు. నిర్వాసితులకు పునరావాస ప్యాకేజీలు ఇవ్వకుండా నీళ్లు అందించడం సాధ్యం కాదన్నారు. జిల్లాలో ఇంకా నాలుగు వేల ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందని చెప్పారు.

**ఆర్థిక ఇబ్బందుల్లోనూ పనులు**



రాష్ట్ర ఆర్థిక పరిస్థితి తీవ్రంగా దెబ్బతిన్నప్పటికీ ప్రభుత్వం అభివృద్ధి పనులను కొనసాగిస్తోందని సీఎం తెలిపారు. యాభై శాతం నిధులు కూడా ఖర్చు పెట్టకుండా తొంభై శాతం పనులు పూర్తయ్యాయని గత పాలకులు చెప్పారని విమర్శించారు. సివిల్ పనులు, భూసేకరణ కోసం తగిన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పులు, వడ్డీల కింద రూ.52,121 కోట్లు చెల్లించామని వెల్లడించారు. అలాగే ఇరిగేషన్ ప్రాజెక్టుల పాత బిల్లుల కోసం రూ.22 వేల కోట్లు విడుదల చేశామని, అందులో దాదాపు రూ.8 వేల కోట్లు పాలమూరు జిల్లా ప్రాజెక్టులకే కేటాయించినట్లు తెలిపారు.

రాబోయే రెండేళ్లలో జిల్లాలోని పెండింగ్ ఇరిగేషన్ పనులను పూర్తి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని రేవంత్ రెడ్డి చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒకసారి ఉన్నతస్థాయి సమీక్షలు నిర్వహిస్తూ పనులను వేగవంతం చేస్తామని భరోసా ఇచ్చారు.

# పాలమూరు ప్రాజెక్టులపై ప్రత్యేక ఫోకస్

- పెండింగ్ పనుల పూర్తి కోసం సీఎం కార్యాచరణ
- గూడెందొడ్డిలో 15 టీఎంసీల నీటి నిల్వకు కర్ణాటకతో చర్చలు
- పాలమూరు జిల్లాలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- బీఆర్‌ఎస్ హయాంలో ఇరిగేషన్ రంగం దెబ్బతిందన్న ఉత్తమ్
- ధాన్య సేకరణలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ అని వెల్లడి

**మహబూబ్‌నగర్, జూన్ 5:**

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా సాగు, తాగునీటి ప్రాజెక్టుల చరిత్రలో ఇది కీలకమైన రోజని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న అన్ని ప్రాజెక్టులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేస్తామని, అవసరమైన నిధులు సమకూర్చి పనులు వేగవంతం చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులను ఇప్పుడు పూర్తి చేయకపోతే జిల్లా ప్రజలు క్షమించరని పేర్కొన్నారు. రాబోయే ఐదేళ్లలో పాలమూరు రూపురేఖలు మారుతాయని, సాగు విస్తీర్ణం పెరగడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరుతాయని తెలిపారు.

**గూడెందొడ్డిలో 15 టీఎంసీల నీటి నిల్వకు ప్రణాళిక**

ప్రాజెక్టులపై సమీక్ష సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ గూడెందొడ్డి రిజర్వాయర్‌లో 15 టీఎంసీల నీటిని నిల్వ చేసే అవకాశం ఉందన్నారు. కర్ణాటకలో నిర్మించిన బ్రిడ్జి బ్యారేజీల కారణంగా పెద్ద ఎత్తున నీటి నిల్వ జరుగుతోందని, ఈ అంశంపై కర్ణాటక ప్రభుత్వంతో చర్చించి ఉమ్మడి కార్యాచరణ చేపడతామని వెల్లడించారు. ఖర్చులను కూడా రెండు రాష్ట్రాలు పంచుకునే విధంగా ప్రణాళిక రూపొందిస్తామని తెలిపారు.

మక్తల్, నారాయణపేట, కొడంగల్ లిఫ్ట్ ప్రాజెక్టులు గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో నిలిచిపోయాయని ఆరోపించారు. ప్రస్తుతం ఒక టీఎంసీ నీటితో సుమారు 15 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు వివరించారు.

నాగార్జునసాగర్, శ్రీశైలం, ఎస్‌ఆర్‌ఎస్పీ, జూరాల వంటి ప్రధాన ప్రాజెక్టులు కాంగ్రెస్ పాలనలోనే నిర్మించబడ్డాయని సీఎం పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధి పనులకు ప్రతిపక్షాలు సహకరించాలని కోరారు.

**ఇరిగేషన్ రంగాన్ని బీఆర్‌ఎస్ దెబ్బతీసింది: ఉత్తమ్**

నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో తెలంగాణ ఇరిగేషన్ రంగం తీవ్రంగా దెబ్బతిందని ఆరోపించారు. భారీ అప్పులు చేసి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సంక్షోభంలోకి నెట్టారని విమర్శించారు. ప్రాజెక్టుల పనులు పూర్తయ్యాయని గత ప్రభుత్వం ప్రచారం చేసినప్పటికీ క్షేత్రస్థాయిలో ఆయకట్టుకు నీరు చేరలేదని అన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును జూరాల నుంచి శ్రీశైలంకు మార్చడం వల్ల భారీ నష్టం జరిగిందని, వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినా రైతులకు ప్రయోజనం కలగలేదని విమర్శించారు. కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, నెట్టెంపాడు సహా పలు ప్రాజెక్టులు గత పదేళ్లలో నిర్లక్ష్యానికి గురయ్యాయని పేర్కొన్నారు. కృష్ణా జలాల హక్కుల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం సమర్థంగా పోరాడుతోందని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే కృష్ణా నీటి వినియోగం పెరిగిందని తెలిపారు.


**ధాన్య సేకరణలో తెలంగాణ అగ్రస్థానం**

ఈ సీజన్‌లో రాష్ట్ర ప్రభుత్వం రికార్డు స్థాయిలో 71.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. గతంతో పోలిస్తే 60 శాతానికి పైగా అధిక ధాన్యం సేకరించామని చెప్పారు. వరి ఉత్పత్తి, ధాన్య సేకరణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని తెలిపారు. రైతులకు మద్దతుగా ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.

# ప్రభుత్వ భూముల్లో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు

**మొదటిపేజీ తరువాయి**

లక్ష ఇండ్లు నిర్మించబోతున్నామని రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార , పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ స్థలాలల్లో లక్ష ఇండ్లను నిర్మించి ఆ స్థలంలో వారి వాటాకు యజమానిని చేస్తూ పేదింటి ఆడబిడ్డలకు ఇవ్వబోతున్నామని ప్రకటించారు. క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంపై సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో శుక్రవారం సమీక్షించారు. 2026 27కు క్యూర్ పరిధిలో లక్ష ఇండ్లకు, ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇండ్లకు ఇప్పటికే ప్రరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చామని, దీన్ని దృష్టిలో పెట్టుకుని అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వం పేదల జీవన పరిస్థితులను, వారి ఉపాధి అవసరాలను ఏమాత్రం పట్టించుకోకుండా నగరానికి 3040 కి.మీ దూరంలో అరకొరగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను నిర్మించిందని విమర్శించారు. ఇల్లు అనేది పేద కుటుంబానికి ఎంత అవసరమో వారి జీవనోపాధి కూడా అంతే ముఖ్యమనే విషయాన్ని గత పాలకులు విస్మరించారన్నారు. రోజువారీ కూలి పనులు, చిన్న వ్యాపారాలు, ఉపాధి అవకాశాలపై ఆధారపడే పేద కుటుంబాలు నగర శివార్లలో నిర్మించిన ఇళ్లకు వెళ్లలేకపోయాయని, ఉపాధి దూరమవడంతోపాటు పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, రవాణా వంటి సమస్యలు ఎదురవడంతో అనేక కుటుంబాలు ఆ ఇళ్లలో నివసించడానికి ఆసక్తి చూపలేదని చెప్పారు. ఫలితంగా ఆ గృహాలు నిరుపయోగంగా మిగిలాయన్నారు. ఇలాంటి తప్పిదాలు పునరావృతం చేయకుండా పేదలు



ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాల్లోనే గౌరవప్రదమైన జీవితం గడిపేలా ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టబోతున్నామని, ఈ దిశగా విలువైన ప్రభుత్వ భూములను పేదల సంక్షేమం కోసం వినియోగిస్తూ లక్ష ఇళ్ల నిర్మాణ కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నామని మంత్రి వెల్లడించారు. ముఖ్యంగా పేద కుటుంబాల మహిళలకు సొంతింటిపై హక్కు కల్పించడం ద్వారా వారి ఆర్థిక, సామాజిక భద్రతను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. సొంత ఇల్లు మహిళ సాధికారతకు, కుటుంబ స్థిరత్వానికి, భవిష్యత్ తరాల అభివృద్ధికి బలమైన పునాది అవుతుందన్నారు. పేదలకు సౌకర్యవంతంగా ఉండేలా ఇండ్ల డిజైన్‌లను రూపొందించాలని, ఇంటి నిర్మాణం కనీసం 400 చదరపు అడుగుల విస్తీర్ణం ఉండేలా ప్లాన్ చేయాలని అధికారులను ఆదేశించారు. సమీక్షలో హౌసింగ్ సెక్రెటరీ వి.పి.గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

# రూ.30 వేల కోట్ల ప్రభుత్వ భూమికి రక్షణ

**మొదటిపేజీ తరువాయి**

హెచ్‌ఎండీఏకు కేటాయించిన భూముల సరిహద్దులను గుర్తించి రక్షణ చర్యలు చేపట్టారు. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలోని రాతిగుట్టల పరిరక్షణ కోసం పోరాటం చేస్తున్న పర్యావరణ సంస్థల విజ్ఞప్తుల నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు.


రెవెన్యూ రికార్డుల ప్రకారం సంబంధిత సర్వే నంబర్లలో 293 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉండగా, వివిధ కేటాయింపులు, భూ వివాదాల అనంతరం సుమారు 200 ఎకరాల భూమి హెచ్‌ఎండీఏ పరిధిలో మిగిలింది. ఈ ప్రాంతంలో విలువైన చారిత్రక రాతిగుట్టలు, సహజ శిలా నిర్మాణాలు ఉండటంతో వాటి పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చారు.

పర్యావరణ నిపుణుల అంచనా ప్రకారం ఈ రాతిగుట్టలకు సుమారు 250 కోట్ల సంవత్సరాల చరిత్ర ఉంది. సహజసిద్ధంగా ఏర్పడిన ఈ శిలా నిర్మాణాలు హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో అరుదైన భౌగోళిక వారసత్వ సంపదగా గుర్తింపు పొందాయి. వీటి సంరక్షణ ద్వారా ప్రకృతి వారసత్వాన్ని కాపాడే అవకాశం ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు.

హైడ్రా చర్యలను పర్యావరణ సంస్థల ప్రతినిధులు స్వాగతించారు. సహజసిద్ధమైన కొండలు, రాతి నిర్మాణాలు, పచ్చదనాన్ని పరిరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు విలువైన ప్రకృతి సంపదను అందిస్తున్నట్లు అభిప్రాయపడ్డారు. అలాగే ఈ ప్రాంతంలో అక్రమ కార్యకలాపాలకు అడ్డుకట్ట పడుతుందని పేర్కొన్నారు.

ఈ ప్రాంతానికి సమీపంలోని భగీరథమ్మ చెరువు పునరుద్ధరణ పనులు కూడా కొనసాగుతున్నాయి. ఎత్తైన కొండలు, సహజ రాతిగుట్టలు, చెరువు సమన్వయంతో ఉన్న ఈ ప్రాంతం భవిష్యత్తులో ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని స్థానికులు, పర్యావరణవేత్తలు భావిస్తున్నారు.

ప్రభుత్వ భూములు, ప్రకృతి సంపద, చారిత్రక వారసత్వ పరిరక్షణలో హైడ్రా చేపట్టిన ఈ చర్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.





# రూ.1600 కోట్ల విలువ చేసే బొగ్గు మాయం

**మొదటిపేజీ తరువాయి**

మొదలుకుని వందల అక్రమాల విషయంలో కేంద్రం నుంచి స్పందన లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఈమేరకు ఆయన కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డికి లేఖ రాశారు. ఎప్పటికప్పుడు నిల్వలు తనిఖీ చేసే బొగ్గు గనుల శాఖ కానీ, కాగ్ అధికారులు కానీ ఇప్పటిదాకా ఎందుకు తనిఖీలు చేపట్టలేదని ప్రశ్నించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణి మనుగడనే దెబ్బతీస్తున్నాయని ఆరోపించారు. కిషన్ రెడ్డి రేవంత్ రెడ్డి మిలాఖాత్ లేకుంటే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వరుస స్కాంలతో వణికిపోతున్న సింగరేణిలో రూ.1600 కోట్లు విలువ చేసే బొగ్గు మాయం చేసి సంస్థ గొంతుకోసే కుట్రకు తెరతీశారని ఆరోపించారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఏకంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల స్కామ్ జరగడం సంస్థ మనుగడనే ప్రమాదంలోకి నెడుతోందన్నారు. సింగరేణి అధికారిక వెబ్ సైట్ రికార్డుల్లో ఏడు గనుల వద్ద బొగ్గు స్టాక్ ఉన్నట్టు పేర్కొన్నప్పటికీ క్షేత్రస్థాయిలో అది కనిపించకపోవడం ఈ కుంభకోణాన్ని తేటతెల్లం చేస్తోందన్నారు. 40 లక్షల టన్నుల బొగ్గు మీద కోల్ సెస్ తోపాటు, ఇన్ కమ్ టాక్స్ కూడా కట్టామని లెక్కలు చూపిస్తున్నా క్షేత్రస్థాయిలో బొగ్గు లేకపోవడం వెనక ఎవరి హస్తం ఉందో తేలాల్సిన అవసరం ఉందన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మందమర్రిలో 7,20,00 మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్ లో 8 లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం1 లో ఆరు లక్షలు, రామగుండం2 లో నాలుగు లక్షలు, భూపాలపల్లిలో 5 .40 లక్షలు, ఇల్లందులో 3.50 లక్షలు, సత్తుపల్లిలో 2 లక్షల మెట్రిక్ టన్నులతోపాటు ఇతర వాటిని కలిపి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని లెక్కలు చూపించారు.. కానీ స్టాక్ పాయింట్ల దగ్గర ఆ బొగ్గు లేకపోవడమే ఈ కుంభకోణానికి అతిపెద్ద ఆధారమని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ లోనే గనుల వద్ద నిల్వలను తనిఖీ చేసే గనుల శాఖ అధికారుల బృందాలు రాకపోవడం, చివరికి కాగ్ అధికారులు కూడా ఇప్పటిదాకా తనిఖీలు చేపట్టకపోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నదన్నారు. ఈ స్కాంను దాచిపెట్టే కుట్రలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఒక అఖిలపక్షాన్ని ఆయా గనుల వద్దకు పంపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కుంభకోణమే కాక ఇటీవల బీఆర్ఎస్ వెలుగులోకి తెచ్చిన నైని బొగ్గు గని టెండర్ల స్కాం కూడా దేశవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపిందన్నారు. తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి సింగరేణిని కబళించేందుకు సీఎం రేవంత్ హయాంలో సైట్ విజిట్ సర్టిఫికెట్ అనే నిబంధన పెట్టి కోరుకున్న వారికి టెండర్లు కట్టబెట్టే కుతంత్రాన్ని అమలుచేశారన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి బావమరిది సృజన్ రెడ్డి కనుసన్నల్లోనే ఇదంతా జరుగుతుందని తేలినా ఇప్పటిదాకా దీనిపై మీరు చర్యలు తీసుకున్న పాపాన పోలేదని కేటీఆర్ గుర్తుచేశారు.

**అక్రమార్కుల భరతం పట్టే దిశగా అడుగు వేయలేదు**

నైని కోల్ స్కామ్ ను బీఆర్ఎస్ బయటపెట్టగానే ఆగమేఘాల మీద టెండర్ల ప్రక్రియను రద్దుచేస్తున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు తప్ప టెండర్లలో అక్రమార్కుల భరతం పట్టే దిశగా ఒక్క అడుగు వేయలేదన్నారు. టెండర్ పోటీదారులను బెదిరించి, భయపెట్టి ప్రక్రియ నుంచి తప్పించే పన్నాగాలు సాగినా దీనికి అడ్డుకట్ట వేసే ప్రయత్నం చేయలేదు. ఈ టెండర్ల అక్రమాలను నిగ్గు తేల్చడానికి కేంద్రం వేసిన కమిటీ ఇప్పటివరకూ ఏం తేల్చిందో కూడా పత్తాలేదు. నైని కుంభకోణంపై సమగ్ర విచారణ జరిపి మూడురోజుల్లోనే నివేదిక ఇవ్వాలని ఆదేశించిన కేంద్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు మొద్దునిద్ర పోతోందో సింగరేణి కార్మికులకు సమాధానం చెప్పాలన్నారు. గతంలో నైని స్కామ్ తోపాటు.. 107 మెగా వాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టుల నిబంధనలకు పాతరేసి నేషనల్ యావరేజీని కూడా మించి అత్యధిక ధరలకు టెండర్లు కట్టబెట్టి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుంచి నేరుగా డీజిల్ కొనుగోలు చేసే విధానాన్ని అర్థాంతరంగా రద్దుచేసి అందులోనూ దోపిడీకి తెరలేపారు. అలాగే పేలుడు పదార్థాల కొనుగోళ్లలోనూ కోల్ ఇండియా కంటే 30 శాతం అధిక నిధులు చెల్లించి అనుయాయులకు కట్టబెట్టారు. అంతే కాకుండా చివరికి మెస్సీతో ముఖ్యమంత్రి ఫుట్ బాల్ మ్యాచ్ కోసం రూ.110 కోట్ల సింగరేణి నిధులను దుర్వినియోగం చేసినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇలా వరుస కుంభకోణాలు జరుగుతున్నా అక్రమార్కుల భరతం పట్టకుండా కేంద్ర ప్రభుత్వం మీనమేషాలు లెక్కించడం వెనక కాంగ్రెస్‌బీజేపీ చీకటి ఒప్పందాలే కారణమని కార్మికులకు అర్థమైపోయిందన్నారు. సింగరేణిలో జరుగుతున్న అక్రమ దందాలను వెలుగులోకి తెచ్చేందుకు చివరికి ఆర్టీఐ కింద దరఖాస్తు చేసినా వివరాలు బయటకు పొక్కకుండా దుష్టశక్తులు అడ్డుకుంటున్న దుస్థితి నెలకొందన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ వెలుగులోకి తెచ్చిన రూ.1600 కోట్ల సింగరేణి బొగ్గు కుంభకోణంపై వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కార్మికుల పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ కుంభకోణంపై ఒకవేళ మీరు విచారణ జరపకపోతే కార్మికలోకంతో కలిసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై బీఆర్ఎస్ పార్టీ జంగ్ సైరన్ మోగిస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# నిధులు, నియామకాలు, నీళ్లలో విఫలం

**మహబూబాబాద్, జూన్ 5:**

తెలంగాణ ప్రజలు బీజేపీ వైపు ఆశగా చూస్తున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ కార్యకర్తల శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. అనంతరం మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో నిధులు, నియామకాలు, సాగునీటి వ్యవస్థల్లో వైఫల్యాలు జరిగాయని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం.. అవినీతి, నిర్లక్ష్యంతో పాలన సాగిస్తోందని వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ హా పూర్తిగా అమలు కాలేదని తెలిపారు. తెలంగాణ అభివృద్ధికి 'డబుల్ ఇంజిన్ సర్కార్' అవసరమని వెల్లడించారు. 2014 తర్వాత దేశంలో సంక్షేమం, అభివృద్ధి సమన్వయంతో ముందుకు సాగుతోందని రాంచందర్‌రావు అన్నారు. బీజేపీ కార్యకర్తలు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సోషల్ డియా వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతతో పాటు ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కొనసాగించాలన్నారు. శిక్షణా తరగతుల్లో చర్చించిన 12 అంశాలను ప్రజలకు క్షుణ్ణంగా వివరించాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, బీజేపీ సిద్ధాంతాలను ప్రజలకు చేరవేయాలని నేతలకు రాంచందర్‌రావు సూచించారు.

# గండిపేట భూకబ్జా కుట్ర కేసులో అరెస్ట్

**హైదరాబాద్, జూన్ 5:**

గండిపేట ప్రాంతంలోని ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు జరిగిన కుట్ర కేసులో ప్రధాన నిందితుడు బొల్లా బ్రహ్మానాయుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు విఘాతం కలిగించే చర్యలపై కఠినంగా వ్యవహరిస్తామని అధికారులు స్పష్టం చేశారు.

పోలీసుల వివరాల ప్రకారం, గండిపేట పరిధిలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు పది ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు కుట్ర పన్నినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇందుకోసం నకిలీ ప్రభుత్వ ఉత్తర్వులు, తప్పుడు రెవెన్యూ రికార్డులు, నకిలీ పత్రాలను సృష్టించి భూమిపై హక్కులు సాధించేందుకు ప్రయత్నించినట్లు దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

ఈ వ్యవహారంలో బొల్లా బ్రహ్మానాయుడు కీలక పాత్ర పోషించినట్లు గుర్తించిన దర్యాప్తు బృందం అతడిని అదుపులోకి తీసుకుంది. భూకబ్జా ప్రయత్నంలో మరికొందరి పాత్రపై కూడా విచారణ కొనసాగుతున్నట్లు సమాచారం. కేసుకు సంబంధించిన కీలక పత్రాలను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ప్రభుత్వ భూములను అక్రమంగా ఆక్రమించుకునేందుకు నకిలీ పత్రాలను వినియోగించడం తీవ్రమైన నేరమని పోలీసులు పేర్కొన్నారు. భూముల వ్యవహారాల్లో మోసాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూముల కొనుగోలు సమయంలో ప్రజలు సంబంధిత రికార్డులను పూర్తిగా పరిశీలించాలని సూచించారు.

ఇటీవలి కాలంలో ప్రభుత్వ భూములపై అక్రమ ఆక్రమణలు, నకిలీ పత్రాల వినియోగానికి సంబంధించిన కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు శాఖలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. ఇలాంటి అక్రమాలను గుర్తించి అడ్డుకునేందుకు సమన్వయంతో చర్యలు చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు.

ఈ కేసులో మరిన్ని వివరాలు సేకరించేందుకు దర్యాప్తు కొనసాగుతోందని, భూముల అక్రమ బదిలీలు, నకిలీ పత్రాల తయారీ వెనుక ఉన్న ఇతర వ్యక్తుల పాత్రను కూడా వెలికితీస్తామని సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ విషయంలో ఎలాంటి అక్రమ కార్యకలాపాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

# ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణానికి రైల్వే బోర్డు 'నో'

- **ఉచిత ప్రయాణ ప్రతిపాదనను తిరస్కరించిన బోర్డు**

**తెలంగాణ బ్యూరో, జూన్ 5:**

హైదరాబాద్ నగర ప్రజలకు ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణాన్ని తీసుకురావాలన్న రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనకు రైల్వే బోర్డు నుంచి చుక్కెదురైంది. జూన్ 2 నుంచి ప్రయాణికులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలంటూ రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనను రైల్వే బోర్డు శుక్రవారం తిరస్కరించింది. ఇప్పటికే తాము భారీ నష్టాల్లో నడుస్తున్నామని, ఇలాంటి పరిస్థితుల్లో ఉచిత ప్రయాణాలు సాధ్యం కాదని స్పష్టం చేస్తూ ప్రభుత్వానికి లేఖ రాసింది. రైల్వే అధికారులు పంపినఎంఎంటీఎస్ ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభాన్ని లెక్కలతో సహా వివరించారు. సర్వీసుల నిర్వహణ వల్ల కేవలం ఒక్క ఏడాదిలోనే దాదాపు రూ.160 కోట్ల మేర నష్టం వాటిల్లిందని అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంఎంటీఎస్ ప్రాజెక్టులకు సంబంధించి తమకు చెల్లించాల్సిన రూ.490 కోట్ల పాత బకాయిలను కూడా ఇంకా చెల్లించలేదని రైల్వే బోర్డు లేఖలో పేర్కొన్నారు. ఒకవేళ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత ప్రయాణ పథకాన్ని ఖచ్చితంగా అమలు చేయాలని భావిస్తే.. దానికి సంబంధించిన పూర్తి ఆర్థిక భారాన్ని మోసేందుకు సిద్ధంగా ఉండాలని రైల్వే బోర్డు స్పష్టం చేసింది. ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఎంఎంటీఎస్ వ్యవస్థకు వచ్చే నష్టాల మొత్తాన్ని 100 శాతం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుందని లిఖితపూర్వకంగా హామీ ఇస్తేనే.. ఆ ప్రతిపాదనకు తాము అంగీకరిస్తామని రైల్వే అధికారులు తేల్చిచెప్పారు.

# చెరువులతో నగరానికి జీవకళ తెద్దాం

- **ప్రకృతిని పరిరక్షించుకుందామంటూ హైడ్రా ప్రచారం**
- **ముఖ్యమైన కూడళ్లలో ప్లకార్డులను ప్రదర్శించిన హైడ్రా**
- **హైడ్రా ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణదినోత్సవం**

**తెలంగాణ బ్యూరో ,జూన్ 5:**



గొలుసుకట్టు చెరువులను కాపాడుకుందాం.. చెరువులతో నగరానికి జీవకళ తీసుకువద్దాం.. ప్రకృతిని పరిరక్షిద్దాం.. పర్యావరణ పరిరక్షణలో భాగస్వామ్యమౌదాం అంటూ నగరంలో హైడ్రా నినదించింది. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నగరంలోని పలు ముఖ్యమైన కూడళ్లు, క్రీడామైదానాలు వద్ద ప్రకృతి పరిరక్షణపై చైతన్య కార్యక్రమాన్నిహైడ్రా చేపట్టింది. ట్రాఫిక్ పోలీసులు, ఐటీ ఉద్యోగులు, చిన్నారులు, నగర ప్రజలు ఈ కార్యక్రమంలో భాగస్వామ్యమై భవిష్యత్ నగరానికి బాటలు వేశారు. మన చెరువులు మన భవిష్యత్.., హైడ్రాతో కలసి చెరువులను పరిరక్షించుకుందాం, సేవ్ వాటర్ సేవ్ లైఫ్, పర్యావరణంతో మెరుగైన జీవితం అంటూ నినదించారు. బాలాపూర్ చౌరస్తా, అమీర్‌పేటలోని మైత్రివనం, ఆరాంఘర్ చౌరస్తా, కర్బలా జంక్షన్, ఎల్.బి.నగర్త, హైటెక్‌సిటీ, గోల్కొండ, సికింద్రాబాద్, రాజేంద్రనగర్, శంషాబాద్ తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలు చేపట్టారు. హైడ్రా ఆర్ ఎఫ్‌వో శ్రీ జయప్రకాష్, డీఆర్ఎఫ్ బృందాలు, ట్రాఫిక్ పోలీసు సిబ్బంది, స్థానిక ప్రజలు, వాహనదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలు, పరిశుభ్రమైన పరిసరాల అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించారు. భూమిని పచ్చదనంతో నింపేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని, నాటిన మొక్కలను సంరక్షించాలని పిలుపునిచ్చారు. అలాగే నీటి వనరులను కాపాడుకోవడం, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రత పాటించడం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని వివరించారు. ప్రస్తుత కాలంలో పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పుల నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణ ప్రతి పౌరుడి సామాజిక బాధ్యతగా భావించి అందరూ భాగస్వాములు కావాలని హైడ్రా అధికారులు కోరారు. కార్యక్రమం ద్వారా ప్రజల్లో పర్యావరణంపై అవగాహన పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.

# పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేస్తాం: డీజీపీ సీవీ ఆనంద్

- **తొలి నెలలోనే మూడు ప్రధాన దోపిడీ కేసుల ఛేదన**
- **ప్రధాని, కేంద్ర హోంమంత్రి పర్యటనలకు విజయవంతమైన బందోబస్తు**
- **ట్రాఫిక్, విజిలెన్స్, ఆహార కల్తీ నిరోధక విభాగాల ఏర్పాటుకు ప్రతిపాదనలు**

**హైదరాబాద్, జూన్ 5:**

తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ డైరెక్టర్ జనరల్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం తొలి నెలలో చేపట్టిన చర్యలపై డీజీపీ సీవీ ఆనంద్ వివరాలు వెల్లడించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజా భద్రత అంశాలపై ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత పలు కీలక అంశాల్లో పురోగతి సాధించామని పేర్కొన్నారు. తొలి నెలలోనే మూడు ప్రధాన దోపిడీ కేసులను ఛేదించామని డీజీపీ తెలిపారు. నేరాల దర్యాప్తులో వేగం పెంచి నిందితులను గుర్తించి చట్టం ముందు నిలబెట్టే దిశగా పోలీసు శాఖ సమర్థంగా పనిచేసిందని చెప్పారు. నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని మరింత విస్తరించేందుకు చర్యలు చేపడుతున్నామని వివరించారు. ప్రధానమంత్రి, కేంద్ర హోంమంత్రి రాష్ట్ర పర్యటనల సందర్భంగా విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసి కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. భారీ స్థాయిలో బందోబస్తు చేపట్టడం ద్వారా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. బక్రీద్ పండుగను కూడా ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసు శాఖ సమన్వయంతో పనిచేసిందని వివరించారు. రాష్ట్రంలో పోలీసింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు కొత్త విభాగాల ఏర్పాటుపై ప్రతిపాదనలు సిద్ధం చేశామని సీవీ ఆనంద్ తెలిపారు. ట్రాఫిక్ నిర్వహణ, విజిలెన్స్ అమలు, ఆహార కల్తీ నిరోధక చర్యల కోసం ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలనే ఆలోచనపై కసరత్తు జరుగుతోందన్నారు. ప్రజా సమస్యలకు మరింత సమర్థవంతంగా స్పందించడమే ఈ ప్రతిపాదనల ప్రధాన లక్ష్యమని చెప్పారు. పోలీసు శాఖలో సిబ్బంది వినియోగం, అవసరాలపై సమగ్ర అంచనా వేసేందుకు సిబ్బంది ఆడిట్ ప్రక్రియను ప్రారంభించామని డీజీపీ వెల్లడించారు. అందుబాటులో ఉన్న మానవ వనరులను సమర్థంగా వినియోగించడం ద్వారా సేవల నాణ్యతను పెంచేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. అవసరమైన చోట సిబ్బంది బలోపేతానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రాష్ట్ర ప్రజలకు మెరుగైన భద్రతా సేవలు అందించడమే తమ ప్రధాన లక్ష్యమని సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. సాంకేతికత, సమర్థవంతమైన పరిపాలన, వేగవంతమైన స్పందన ద్వారా తెలంగాణ పోలీసు శాఖను మరింత ప్రజామిత్రంగా తీర్చిదిద్దేందుకు కృషి కొనసాగిస్తామని పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు నేరాల నివారణకు కూడా ప్రాధాన్యం ఇస్తామని తెలిపారు

# ఆహార భద్రత ప్రమాణాలపై ప్రత్యేక దృష్టి

**హైదరాబాద్, జూన్ 5:**

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేసే పోషకాహార సేవలను మరింత నాణ్యంగా, సురక్షితంగా అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోంది. అంగన్‌వాడీ సేవల బలోపేతం, ఆహార భద్రత ప్రమాణాల కచ్చితమైన అమలుపై మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క నిరంతరం ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారం నాణ్యత, పరిశుభ్రత, నిల్వ విధానాలు, పంపిణీ వ్యవస్థ తదితర అంశాలపై మంత్రి సీతక్క స్వయంగా జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారులతో తరచూ వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ సమీక్షలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఎలాంటి లోపాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రతపై అంగన్‌వాడీ సిబ్బందికి మరింత అవగాహన కల్పించేందుకు వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డేను పురస్కరించుకుని ఈ ఆదివారం (7వ తేదీ)రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ శిక్షణలో అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆహార పదార్థాల సేకరణ, నిల్వ, వంట ప్రక్రియ, పరిశుభ్రత ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ, లబ్ధిదారులకు సురక్షితమైన పోషకాహారం అందించే విధానాలపై సమగ్ర అవగాహన కల్పించనున్నారు. మంత్రి సీతక్క ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం కోసం జిల్లాల వారీగా ఫుడ్ సేఫ్టీ అధికారులను మాస్టర్ ట్రైనర్లుగా నియమించారు. వారు అంగన్‌వాడీ సిబ్బందికి ఆహార భద్రత, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలపై ప్రత్యక్ష శిక్షణ అందించనున్నారు. ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫఎసఎసఏఐ) మార్గదర్శకాల ప్రకారం వీరు శిక్షణ ఇస్తారు. వరల్డ్ ఫుడ్ సేఫ్టీ డే స్ఫూర్తితో ఆహార భద్రత ప్రమాణాలను మరింత పటిష్ఠం చేయడానికి ఈ శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందని మంత్రి సీతక్క ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలు ఆహార భద్రత ప్రమాణాలను పూర్తిస్థాయిలో అమలు చేసేలా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

# అగ్నిప్రమాదంపై ఆరా తీస్తున్నాం

- **మైత్రీవనం అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని సందర్శించిన హైడ్రా కమిషనర్**
- **కేఎస్ఆర్ భవనానికి అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలిస్తాం**

**తెలంగాణ బ్యూరో ,, జూన్ 5:**

ఈ నెల 4న హైదరాబాద్ లోని మైత్రివనంలో జరిగిన అగ్ని ప్రమాదంపై ఆరా తీస్తున్నట్లు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెల్లడించారు. ఆ కాంప్లెక్స్ కు ఆనుకొనే ఉన్న హర్ష మెస్ డీలక్స్‌లో స్పార్క్ తో ప్రమాదం జరిగిందా?.. షార్ట్ సర్క్యూట్ తో జరిగిందా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలుతుందని చెప్పారు. మైత్రీవనం అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. బాధితులతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. హర్ష మెస్‌నూ పరిశీలించిన రంగనాథ్..అక్కడ మీడియాతో మాట్లాడారు. మైత్రీవనం సమీపంలో ఉన్న కేఎస్ఆర్ భవనానికి అనుమతులు ఉన్నాయా లేదా పరిశీలిస్తామన్నారు. నాలాను ఆక్రమించి భవనం నిర్మాణం జరిగితే కచ్చితంగా కూలగొడతామని స్పష్టం చేశారు. కేఎస్ఆర్ భవనం షాప్స్ పక్కనే ఉన్న హర్ష డీలక్స్ మెస్‌ను కూడా పరిశీలించామన్నారు. అగ్నిప్రమాదంపై పోలీసుల విచారణ జరుగుతోందని తెలిపారు. అగ్నిప్రమాదం జరిగిన భవనానికి ఎంట్రీ అండ్ ఎగ్జిట్ పాయింట్లు ఒకే వైపు ఉన్నాయన్నారు. బిల్డింగ్‌కు ఫైర్ సేఫ్టీ నిబంధనలు లేవని తెలిపారు. హర్ష మెస్‌తో అగ్ని ప్రమాదం జరిగిందని బాధితులు చెప్తున్నారని.. ప్రమాదానికి గల కారణాలు పోలీసుల దర్యాప్తులో వెల్లడవుతాయని రంగనాథ్ పేర్కొన్నారు. నాంపల్లి బిల్డింగ్ అగ్నిప్రమాదం అనంతరం అన్ని భవనాలకు ఎన్‌ఓసీలు జారీ చేశామన్నారు.

# ప్రజలకు ఉపాధి కల్పనే నిజమైన అభివృద్ధి

**సిద్దిపేట, జూన్ 5:**

సిద్దిపేటలో నూతనంగా ఏర్పాటు చేసిన అద్వితీయ ఎంటర్‌ప్రైజెస్ దుస్తుల తయారీ పరిశ్రమను మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి అంటే రోడ్లు, భవనాలు, కళాశాలలు నిర్మించడం మాత్రమే కాదని, ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పించి వారి కాళ్లపై వారు నిలబడేలా చేయడమేనన్నారు. సిద్దిపేట మహిళలకు, గృహిణులకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పించాలనే తన కల టెక్ లైన్, అద్వితీయ సంస్థల సహకారంతో నేడు సాకారమవుతోందని ఆనందం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలల యూనిఫామ్‌ల తయారీ ద్వారా అనేకమందికి ఉపాధి కల్పిస్తున్న టెక్ లైన్ సంస్థ అధినేత్రి భువనేశ్వరి సేవలను కొనియాడారు. లాభాపేక్ష కంటే ఉపాధి కల్పనకే ప్రాధాన్యతనిస్తూ ప్రశాంత్ నగర్‌లో ఈ పరిశ్రమను ఏర్పాటు చేసిన కోఆపరేటివ్ చైర్మన్ తోట శ్రీకాంత్ రెడ్డి బృందాన్ని అభినందించారు. ఈ పరిశ్రమలో 70 మంది మహిళలు పనిచేస్తున్నారని, త్వరలోనే స్టిచ్చింగ్ విభాగంలో 100 మంది, ప్యాకింగ్ విభాగంలో మరో 100 మంది మహిళలకు ఉపాధి లభించనుందని తెలిపారు. సాధారణంగా నెల రోజుల సమయం పట్టే శిక్షణను సిద్దిపేట మహిళలు కేవలం నాలుగు రోజుల్లోనే నేర్చుకోవడం వారి ప్రతిభకు నిదర్శనమని అన్నారు. మహిళలంతా నాణ్యతతో కూడిన పనితీరును కనబరిస్తే మరిన్ని ఆర్డర్లు వస్తాయని, తద్వారా ఉపాధి అవకాశాలు 200 నుంచి 400, అనంతరం 800 మందికి విస్తరించే అవకాశం ఉందని వివరించారు.గతంలో సిద్దిపేటలో 6 వేల మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందించినప్పటికీ అవి గృహ స్థాయికే పరిమితమయ్యాయని, కానీ అంతర్జాతీయ స్థాయిలో పోటీపడాలంటే అద్వితీయ సంస్థలో ఏర్పాటు చేసిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్రాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. మహిళల శ్రమ, క్రమశిక్షణ, నాణ్యత ఆధారంగానే భవిష్యత్తులో సిద్దిపేట దేశంలో రెండో షోలాపూర్‌గా ఎదిగే అవకాశం ఉందన్నారు. సంస్థ విస్తరణ కోసం ఇంజనీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాలతో తానే స్వయంగా మాట్లాడి మరిన్ని ఆర్డర్లు వచ్చేలా సహకరిస్తానని హామీ ఇచ్చారు. దేశంలోని సుమారు రూ.60 వేల కోట్ల టెక్స్‌టైల్ పరిశ్రమలో 70 శాతం వాటా స్టిచ్చింగ్ రంగానిదేనని, ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ మాటల్లోనేనా?

## ఫొటోలకే పరిమితమైన వేడుకలు
## మారుతున్న వాతావరణం
## జనాభా శాపం - ప్రకృతి దోపిడీ
## కలుషితమైన జీవనదులు

ప్రతి సంవత్సరం జూన్ 5వ తేదీన ప్రపంచవ్యాప్తంగా పర్యావరణ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటున్నాం. ఐక్యరాజ్యసమితి 1972లో స్వీడన్ సమ్మేళనంలో 119 దేశాల భాగస్వామ్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం ప్రజల్లో అవగాహన కల్పించడమే. అయితే, ఏటా ఈ పర్వదినం రాగానే పాలకులు మొక్కలు నాటడం, సైకిళ్లు తొక్కడం, ఫొటోలకు పోజులివ్వడం వంటి హడావిడి చేస్తున్నారే తప్ప, పర్యావరణ పరిరక్షణపై చిత్తశుద్ధితో కఠిన చట్టాలను అమలు చేయడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పాలకుల ఈ విధ్వంసకర, నిర్లక్ష్య వైఖరి వల్లే నేడు భారతదేశంలో పర్యావరణం తీవ్రంగా దెబ్బతింటోంది.

### ఉత్పాతంలా మారుతున్న వాతావరణం

బాధ్యతారహితమైన మానవ చర్యల వల్ల వాతావరణంలో ఎల్‌నినో వంటి తీవ్రమైన సమస్యలు ఉత్పాతంలా వచ్చి పడుతున్నాయి. ఒకప్పుడు జూన్ మాసం రాకముందే దేశంలో జోరు వానలు పడేవి; కానీ నేడు ఆ పరిస్థితి ఎక్కడా కానరావడం లేదు. ఈ యేడు కూడా నైరుతి రుతుపవనాలు అత్యంత ఆలస్యంగా ప్రవేశించాయి, ఎండల తీవ్రత ఇంకా కొనసాగుతూనే ఉంది. పెరుగుతున్న జనాభా తమ స్వార్థ అవసరాల కోసం ప్రకృతిని యథేచ్ఛగా దోచుకోవడమే దీనికి ప్రధాన కారణం. ఊరూరా చెరువులను మింగేయడం, ఇసుక-మట్టిని తోడేయడం, అడవులను నరికివేస్తూ కొండలను ఆనవాళ్లు లేకుండా చేయడంతో పర్యావరణ విధ్వంసం పరాకాష్ఠకు చేరింది. అడవుల నాశనంతో చిరుతలు, పెద్దపులులు జనావాసాల్లోకి వచ్చి పడుతుండటం వన్యప్రాణుల మనుగడ సంక్షోభాన్ని కళ్లకడుతోంది.

### సంస్కృతిని మరిచాం.. పంచభూతాలను కలుషితం

మన పూర్వీకులు, భారతీయ మహర్షులు యావత్ ప్రకృతిని, ప్రాకృతిక శక్తులను దైవ స్వరూపాలుగా ఆరాధించారు. సౌరశక్తిని సూర్యుడిగా, జలాన్ని దేవిగా, నదులను జీవనదాయిని అయిన మాతలుగా కొలిచారు. అందుకనే ప్రాచీన నాగరికతలన్నీ నదీతీరాల వెంబడే ఉద్భవించాయి. ప్రకృతిని రక్షించుకోవాలనే ఉద్దేశంతోనే మన సంస్కృతిలో రావి, మర్రి, తులసి, మామిడి, అరటి వంటి వృక్షాలను పూజించే ఆచారం తెచ్చారు. హోలీ, దీపావళి, సంక్రాంతి, జన్మాష్టమి వంటి పండుగలన్నీ ప్రకృతి సౌందర్యాన్ని, ఋతువుల ప్రాధాన్యతను తెలియజేసేవే. కానీ నేడు బాహ్య, అంతర్గత పర్యావరణాల మధ్య ఉన్న అనుబంధాన్ని మనుషులు మర్చిపోయారు. అవసరానికి మించిన భౌతిక, రసాయనిక పదార్థాలు గాలిలో, నీటిలో చేరడం వల్ల పర్యావరణ అసమతుల్యత ఏర్పడి తీవ్ర కాలుష్యం సంభవిస్తోంది.

### తరిగిపోతున్న స్వచ్ఛమైన నీరు.. పెరిగిపోతున్న వ్యర్థాలు


భూగోళంపై 80 శాతం జలం విస్తరించి ఉన్నప్పటికీ, తాగడానికి ఉపయోగపడే శుద్ధమైన నీటి లభ్యత కేవలం 3 శాతం కంటే తక్కువగానే ఉంది. మిగిలిన నీరంతా ఉప్పునీరు లేదా కలుషిత నీరుగా ఉంది. మనం తల్లిగా భావించి పూజించే గంగ, యమున, గోదావరి వంటి పవిత్ర నదులు నేడు నివాస ప్రాంతాల వ్యర్థాలు, పరిశ్రమల విషతుల్య రసాయనాల వల్ల పెద్ద మురికి కాలువలుగా మారిపోయాయి. దీనివల్ల కేవలం మనుషులే కాక జలచరాలు, సమస్త ప్రాణికోటి నశిస్తోంది. మరోవైపు పట్టణీకరణ, వాహనాల పొగతో వాయు కాలుష్యం పెరిగి ప్రాణవాయువు (ఆక్సిజన్) శాతం పడిపోతోంది. మన దేశంలో ప్రతిరోజూ 15 వేల టన్నుల కంటే ఎక్కువ చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇందులో వందల సంవత్సరాలైనా భూమిలో కలవని ప్లాస్టిక్ వ్యర్థాలు భూసారాన్ని నశింపజేస్తున్నాయి. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను తినడం వల్ల ఎన్నో పశుపక్ష్యాదులు ప్రాణాలు విడుస్తున్నాయి.

### నైతిక బాధ్యతగా భావించాలి

పెరుగుతున్న జనాభా, తరుగుతున్న భూ ఉత్పాదకత మానవ జాతి మనుగడకే ముప్పుగా పరిణమించాయి. ఈ ప్రమాదాన్ని గుర్తించి నదులను, భూగర్భ జలాలను కాపాడుకోవడానికి మనమంతా సంకల్పబద్ధులం కావాలి. నగరాలు, పట్టణాలలో పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, వాయు, భూ కాలుష్యాలను అరికట్టడం ప్రతి ఒక్కరి నైతిక బాధ్యత. పాలకుల విధానాల్లో మార్పు రావడంతో పాటు, పర్యావరణ పరిరక్షణలో కఠినమైన చట్టాలను రాజీ లేకుండా అమలు చేసినప్పుడే ఈ భూమిపై రాబోయే తరాలకు జీవించే హక్కు దక్కుతుంది.

# కాక్రోచ్ జనతా పార్టీ నిరసనపై పిల్

### తక్షణ విచారణకు ఢిల్లీ హైకోర్టు నిరాకరణ




**న్యూఢిల్లీ, జూన్ 5:** దేశ రాజధాని ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ తలపెట్టిన నిరసన కార్యక్రమం నేపథ్యంలో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్)పై తక్షణ విచారణ చేపట్టేందుకు ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. జూన్ 6న కాక్రోచ్ జనతా పార్టీ నిర్వహించనున్న నిరసన కార్యక్రమం అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతూ సేవ్ ఇండియా ఫౌండేషన్ అనే సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ప్రజా శాంతిభద్రతలు, ట్రాఫిక్ నిర్వహణ, ప్రభుత్వ మౌలిక వసతుల పరిరక్షణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఢిల్లీ పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని పిటిషన్‌లో కోరింది. నిరసన కార్యక్రమానికి సంబంధించి సామాజిక మాధ్యమాల్లో భారీ స్థాయిలో ప్రచారం జరుగుతోందని, పెద్ద సంఖ్యలో యువతను సమీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రచారంలో ఉన్న కొన్ని సందేశాలు రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని, భద్రతా బలగాల విధులకు ఆటంకం కలిగించే అంశాలు కూడా కనిపిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. భారీ ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున, ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని పిటిషనర్ వాదించింది. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా, ప్రజల భద్రతకు భంగం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని కోరింది. ఈ విషయమై ఇప్పటికే ఢిల్లీ పోలీసు కమిషనర్‌ను సంప్రదించినప్పటికీ స్పందన లభించలేదని పిటిషన్‌లో పేర్కొంది. దీంతో చివరి మార్గంగా న్యాయస్థానాన్ని ఆశ్రయించినట్లు తెలిపింది. అయితే, పిటిషన్‌ను పరిశీలించిన ఢిల్లీ హైకోర్టు ఈ అంశంపై తక్షణ విచారణ చేపట్టాల్సిన అవసరం లేదని పేర్కొంటూ అత్యవసర విచారణకు నిరాకరించింది. దీంతో ఈ వ్యవహారం తదుపరి విచారణకు వచ్చే వరకు వేచి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

# గ్రేట్ నికోబార్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా రాహుల్ ఆన్‌లైన్ క్యాంపెయిన్!

### కేంద్ర ప్రభుత్వ రూ. 80 వేల కోట్ల మెగా ప్రాజెక్ట్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ప్రతిపక్షాలు

### దేశవ్యాప్తంగా ఆన్‌లైన్ సంతకాల సేకరణకు పిలుపునిచ్చిన కాంగ్రెస్ అగ్రనేత



**న్యూఢిల్లీ:** అండమాన్, నికోబార్ దీవులలోని గ్రేట్ నికోబార్ దీవిని ఒక వ్యూహాత్మక, ఆర్థిక, పర్యాటక కేంద్రంగా మార్చడం కోసం భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్' ఇప్పుడు రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఈ మెగా ప్రాజెక్ట్ కోసం కేంద్ర ప్రభుత్వం దాదాపు 80 వేల కోట్ల రూపాయలను వెచ్చిస్తోంది. అయితే, ఈ ప్రాజెక్ట్‌ను ప్రతిపక్ష పార్టీలు మొదటి నుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సరికొత్తగా ఆన్‌లైన్ క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టారు. ఈ ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల గ్రేట్ నికోబార్ దీవిలోని సున్నితమైన పర్యావరణ వ్యవస్థ పూర్తిగా దెబ్బతింటుందని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వ ధోరణిని నిరసిస్తూ రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదికగా చ+తీవవఅూజవతీ+తీవవస, చబీఱఎశీమీఱతీమీఖవతీం వంటి హ్యాష్‌ట్యాగ్స్‌తో దేశవ్యాప్త సంతకాల సేకరణ ఉద్యమానికి పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్ట్ పనుల కారణంగా నికోబార్ దీవుల్లో స్కూబా డైవింగ్‌తో పాటు ఇతర నిర్మాణ కార్యకలాపాల వల్ల అక్కడి అరుదైన పగడపు దిబ్బలు (కోరల్ రీఫ్స్) తీవ్రంగా విధ్వంసం అవుతున్నాయంటూ రాహుల్ గాంధీ ఆందోళన వ్యక్తం చేశారు.

### ఏంటి ఈ గ్రేట్ నికోబార్ ప్రాజెక్ట్?

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ భారీ ప్రాజెక్ట్‌లో భాగంగా గ్రేట్ నికోబార్ దీవిలో పలు కీలక మౌలిక వసతుల నిర్మాణాలు జరగనున్నాయి. అందులో ముఖ్యంగా అంతర్జాతీయ కంటైనర్ ట్రాన్స్‌షిప్‌మెంట్ టెర్మినల్, గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం, భారీ విద్యుత్ ఉత్పాదన కేంద్రం, ఒక అత్యాధునిక టౌన్‌షిప్ నిర్మాణం, భారత ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు ఈ ప్రాజెక్ట్ ఎంతో కీలకమని ప్రభుత్వం భావిస్తుండగా, పర్యావరణాన్ని పణంగా పెట్టి ఈ ప్రాజెక్ట్ చేయవద్దంటూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ప్రతిపక్షాలు తమ నిరసనను ఉధృతం చేస్తున్నాయి.

# భారత్‌పై పుతిన్ ప్రశంసలు

### విదేశాంగ విధానానికి మద్దతు



**సెయింట్ పీటర్స్‌బర్గ్, జూన్ 5:** భారతదేశ విదేశాంగ విధానంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రశంసలు కురిపించారు. ప్రపంచ రాజకీయాల్లో భారత్ స్వతంత్ర వైఖరితో ముందుకు సాగుతోందని ఆయన పేర్కొన్నారు. భారత్‌తో తమ దేశానికి ఉన్న స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసేందుకు రష్యా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా ప్రముఖ వార్తా సంస్థల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌పై బాహ్య ఒత్తిళ్లు తీసుకురావాలనే ప్రయత్నాలు గతంలో జరిగినప్పటికీ అవి ఆశించిన ఫలితాలను ఇవ్వలేదని పుతిన్ అన్నారు. ముఖ్యంగా రష్యాతో సంబంధాల విషయంలో భారత్ తన స్వతంత్ర నిర్ణయాలను కొనసాగించిందని పేర్కొన్నారు. అంతర్జాతీయ సంబంధాల్లో ఏ దేశంపైనా ఒత్తిడి తీసుకురావడం సరైన విధానం కాదని, అలాంటి చర్యలు ప్రపంచ స్థాయి దౌత్య సంబంధాలను బలహీనపరుస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు నిరంతరం పెరుగుతున్నాయని, రాబోయే కాలంలో ద్వైపాక్షిక వాణిజ్య విలువ వంద బిలియన్ డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంధనం, పరిశ్రమలు, సాంకేతికత, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో పరస్పర సహకారానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని తెలిపారు. భారత్ వంటి పెద్ద దేశంపై ఒత్తిడి తీసుకురావాలనే ప్రయత్నాలు ఆ చర్యలకు పాల్పడే దేశాలకే ప్రతికూల ఫలితాలను ఇవ్వవచ్చని పుతిన్ హెచ్చరించారు. ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్‌కు ప్రత్యేక స్థానం ఉందని, అలాంటి దేశంతో సంబంధాలను దెబ్బతీయడం అంతర్జాతీయ స్థాయిలో అనేక ప్రభావాలను కలిగిస్తుందని అన్నారు. పరస్పర గౌరవం, సమానత్వం ఆధారంగా దేశాల మధ్య సంబంధాలు కొనసాగాలని సూచించారు. భారత్ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అంతర్జాతీయ వేదికలపై మరింత ప్రభావవంతమైన పాత్ర పోషిస్తోందని పుతిన్ అభిప్రాయపడ్డారు. భారత్‌తో సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న స్నేహబంధం భవిష్యత్తులో కూడా మరింత బలపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. రాజకీయ, ఆర్థిక, వ్యూహాత్మక రంగాల్లో రెండు దేశాల మధ్య సహకారం కొత్త స్థాయికి చేరుకుంటుందని పేర్కొన్నారు.

# సంక్షోభం.. సానుకూలంగా!

- టీఎంసీలో తిరుగుబాటు.. మమతకు పెరుగుతున్న ఇబ్బందులు
- కాంగ్రెస్‌పై డీఎంకే అసంతృప్తి.. మారుతున్న రాజకీయ సమీకరణలు
- ఇదే సరైన సమయంగా భావిస్తున్న బీజేపీ
- డీలిమిటేషన్ బిల్లుపై ఫోకస్ పెంచిన కేంద్రం
- ప్రత్యేక మెజారిటీ కోసం ప్రాంతీయ పార్టీల మద్దతుపై ఆశలు



**న్యూఢిల్లీ, జూన్ 5:** దేశ రాజకీయాల్లో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాలు బీజేపీకి అనుకూలంగా మారుతున్నాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. ప్రతిపక్షాల ఇండియా కూటమిలో విభేదాలు పెరుగుతుండగా, కొన్ని కీలక ప్రాంతీయ పార్టీల్లో నెలకొన్న సంక్షోభాలను తమకు అనుకూలంగా మలుచుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నట్లు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా డీలిమిటేషన్ బిల్లును ముందుకు తీసుకెళ్లేందుకు ఇదే సరైన సమయమని కేంద్ర నాయకత్వం భావిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత విభేదాలు ముదురుతున్నాయనే వార్తలు వస్తున్నాయి. మమతా బెనర్జీ నాయకత్వంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న నేతల సంఖ్య పెరుగుతోందని రాజకీయ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అదే సమయంలో పార్టీ ఎంపీల్లోనూ భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయనే ప్రచారం కొనసాగుతోంది. మరోవైపు తమిళనాడులో డీఎంకే, కాంగ్రెస్ మధ్య సంబంధాలు గతంతో పోలిస్తే చల్లబడినట్లు రాజకీయ విశ్లేషణలు వెలువడుతున్నాయి. ఎన్నికల అనంతర పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌పై డీఎంకేలో అసంతృప్తి పెరిగిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ పరిస్థితులను బీజేపీ నిశితంగా గమనిస్తున్నట్లు తెలుస్తోంది. డీలిమిటేషన్ బిల్లు రాజ్యాంగ సవరణకు సంబంధించిన అంశం కావడంతో పార్లమెంటులో మూడింట రెండు వంతుల ప్రత్యేక మెజారిటీ అవసరం. గతంలో సంఖ్యాబలం కొరత కారణంగా ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అయితే ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీల్లో ఏర్పడుతున్న విభేదాలు, మారుతున్న రాజకీయ సమీకరణాలు తమకు కలిసొస్తాయని బీజేపీ అంచనా వేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. లోక్‌సభ స్థానాల పునర్విభజనతో పాటు మహిళా రిజర్వేషన్ అమలుకు కూడా డీలిమిటేషన్ కీలకంగా మారనున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ అంశంపై మరింత దృష్టి సారించినట్లు సమాచారం. 2029లోపు ఈ ప్రక్రియను పూర్తి చేయాలనే లక్ష్యంతో రాజకీయ మద్దతు కూడగట్టే ప్రయత్నాలు కొనసాగుతున్నట్లు తెలుస్తోంది.





## ఘనంగా ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ నాలుగవ వార్షికోత్సవ వేడుకలు

**ముఖ్యఅతిథిగా హాజరైన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి**

**ఏఎస్ రావునగర్, రాజముద్ర న్యూస్:** ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ నాలుగవ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ఏఎస్ రావునగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ లోని ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ(పిడిసి)లో కన్నుల పండుగ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్షికోత్సవ వేడుకలను ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ యువతలో ప్రతిభను వెలికితీసి కళలకు ప్రోత్సాహం అందిస్తున్న ప్రవీణ్ డ్యాన్స్ కంపెనీ నిర్వాహకులు అభినందనీయులని అన్నారు. నృత్య కళ ద్వారా యువతకు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, సృజనాత్మకత పెంపొందుతాయని పేర్కొన్నారు. నాలుగు సంవత్సరాలుగా విజయవంతంగా సంస్థను నిర్వహిస్తూ అనేక మంది యువ కళాకారులను తీర్చిదిద్దుతున్న కొరియోగ్రాఫర్ ప్రవీణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు. కష్టపడే తత్వం ఉంటే పేదరికం ఎప్పటికీ అడ్డంకి కాదని, పట్టుదలతో శ్రమిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని అన్నారు. చిన్ననాటి నుంచే కష్టపడి, తన ప్రతిభతో కొరియోగ్రాఫర్‌గా గుర్తింపు తెచ్చుకున్న ప్రవీణ్‌ను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. స్టూడియో ఏర్పాటు చేసి ఎంతోమంది పిల్లలు, యువకులకు శిక్షణ ఇస్తూ కొరియోగ్రాఫర్లుగా తీర్చిదిద్దుతున్న తీరు ప్రశంసనీయమని తెలిపారు. యువత చదువుతో పాటు కళల రంగంలోనూ రాణించాలని, క్రమశిక్షణతో ముందుకు సాగితే భవిష్యత్తులో గొప్ప అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. అనంతరం సంస్థ వార్షికోత్సవ కేక్ కట్ చేసి, విద్యార్థుల నృత్య ప్రదర్శనలను ఎమ్మెల్యే వీక్షించి వారిని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సింగిరెడ్డి సోమ శేఖర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, ఆకుల మహేందర్, కాప్రా ప్రెస్ క్లబ్ అధ్యక్షులు మెరుగు చంద్రమోహన్, సలహాదారులు బెలిదే అశోక్ గుప్తా, ఉపాధ్యక్షులు యావాపురం రవి, జర్నలిస్ట్ సుధాకర్, పిడిసి యజమాని ఉల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా 3కె వాక్

**కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటిన న్యాయమూర్తులు, న్యాయవాదులు..**

**కుషాయిగూడ, రాజముద్ర న్యూస్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవం 2026 సందర్భంగా తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ వారి ఆదేశాల మేరకు శుక్రవారం మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా 3కె వాక్ నిర్వహించారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు ఆధ్వర్యంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ప్రపంచ పర్యావరణ దినోత్సవం యొక్క అధికారిక థీమ్ "ప్రకృతి స్ఫూర్తితో.. వాతావరణం కోసం.. మన భవిష్యత్తు కోసం" అంటూ కోర్టు ఆవరణలో వివిధ రకాలైన మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యతను న్యాయమూర్తులు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర్ రావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. పర్యావరణ హిత జీవనశైలి, ప్రకృతి సంరక్షణ, కాలుష్య నియంత్రణ వంటి అంశాలపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి సట్టు రవీందర్ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాల కోసం పచ్చదనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందని అధికారులు ఈ సందర్భంగా సూచించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి. రత్నయ్యతో పాటు పలువురు న్యాయమూర్తులు, బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.



## చివరికి తలొగ్గిన కోదాడ బిల్డర్!

**రెండు రోజుల పోరాటం.. చెన్నారం సుతార్ల యూనియన్ విజయగర్జన**

**ఖమ్మం రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, యూనియన్ నిబంధనలను ధిక్కరించిన కోదాడ బిల్డర్ చివరికి దిగొచ్చాడు. జూన్ 1న పనులు చేయకూడదనే నిబంధనను ఉల్లంఘించడంపై చెన్నారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ చేపట్టిన రెండు రోజుల నిరంతర పోరాటం ఫలించింది. బిల్డర్ జరిమానా చెల్లించడంతో వివాదం సద్దుమణిగింది.చెన్నారం గ్రామానికి చెందిన ఓ రైతు ఇంటి నిర్మాణ పనులను జూన్ 1న కోదాడకు చెందిన బిల్డర్ తన సుతార్లతో చేపట్టాడు. యూనియన్ నిబంధనల ప్రకారం ప్రతి నెల 1వ తేదీన ఎలాంటి నిర్మాణ పనులు చేయకూడదు. దీన్ని ఉల్లంఘించడంపై చెన్నారం యూనియన్ నాయకులు, కార్మికులు పనులు నిలిపివేసి ఆందోళనకు దిగారు.పనులు అడ్డుకున్నారంటూ ఇంటి యజమాని కొందరు యూనియన్ నాయకులపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు. యూనియన్ నేతలపై రాజకీయ ఒత్తిళ్లు కూడా వచ్చాయి. అయినా వెనక్కి తగ్గకుండా కార్మికులు సమిష్టిగా పోరాడారు. రెండు రోజుల పాటు నిర్మాణ పనులను పూర్తిగా నిలిపివేసి తమ ఐక్యతను చాటారు.చివరికి కోదాడ బిల్డర్ యూనియన్ పెద్దల సమక్షంలో తప్పు ఒప్పుకొని నిబంధనల ప్రకారం జరిమానా చెల్లించాడు. దీంతో రెండు రోజులుగా కొనసాగుతున్న వివాదానికి తెరపడింది. విజయం సాధించిన చెన్నారం బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సభ్యులు "కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి", "యూనియన్ జిందాబాద్" అంటూ నినాదాలు చేస్తూ సంబరాలు చేసుకున్నారు.యూనియన్ మండల అధ్యక్షుడు ఖాజా, చెన్నారం యూనియన్ అధ్యక్షుడు బట్టపోతుల విజయ్ మాట్లాడుతూ, "ఇది ఒక్కరి విజయం కాదు. యూనియన్ సమిష్టి శక్తికి నిదర్శనం. భవిష్యత్తులో ఎవరైనా యూనియన్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదు. కార్మికుల హక్కులు, యూనియన్ గౌరవం కోసం ఎంతవరకైనా పోరాడతాం" అని స్పష్టం చేశారు. మొదటి నుంచి తమకు అండగా నిలిచిన జర్నలిస్ట్ సోదరులకు కృతజ్ఞతలు తెలిపారు.



## ఉద్యాన పంటల సాగుపై రైతుల అవగాహన కల్పించాలి

- ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ తదితర అంశాలపై తెలియపరచాలి
- రైతులకు సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పంటల గురించి శిక్షణ ఇవ్వాలి
- వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** ఉద్యాన పంటల సాగు ద్వారా అధిక లాభాలను ఆర్జించే విధంగా రైతుల్లో అవగాహన కల్పించి ప్రోత్సహించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేటులోని కాన్ఫరెన్స్ హాల్లో ఉద్యాన పంటల సాగు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ తదితర అంశాలపై భాగస్వామ్య శాఖలు, నాబార్డ్, వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఇరిగేషన్, డ్రిప్, ఆయిల్ ఫామ్ కంపెనీల ప్రతినిధులు, రైతులతో జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జిల్లా మిషన్ పర్యవేక్షణ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన పంటల సాగుకు ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లాకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యాన పంటలను సాగు చేయాలని దీనివల్ల రైతులు అధిక లాభాలను ఆర్జించేందుకు వీలు ఉంటుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు సారవంతమైన భూములు ఉన్నాయని, భూసార పరీక్షలకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని కలెక్టర్ సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యానవన పంటలకు సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందని, రైతులు ఇలాంటి అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా రైతులను ప్రోత్సహించాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. ఉద్యానవన పంటల మొక్కలు నాటేందుకు, నిర్వహణ ఖర్చులకు ప్రభుత్వం మంచి అవకాశాన్ని కల్పిస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సత్యం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో సర్పంచులు, ప్రజా ప్రతినిధులను భాగస్వాములను చేసి ఉద్యాన మన పంటల సాగుకు రైతులను రైతులను ఎంపిక చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ రైతులను గుర్తించి ఆయిల్ ఫామ్ సాగు చేస్తున్న ప్రాంతాలకు తీసుకువెళ్లి క్షేత్రస్థాయిలో వంట సాగుపై అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఆయిల్ ఫాం సాగు చేసుకున్నట్లయితే 30 సంవత్సరాల వరకు అతికొద్ది శ్రమతో ఆర్థికంగా అధిక లాభాలు సాధించవచ్చని అదేవిధంగా అంతర్ పంటలు వేసుకునేది కూడా మంచి అవకాశం ఉంటుందని జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. జిల్లాలో ఆయిల్ ఫామ్ అధికంగా సాగు చేయడం వల్ల ప్రాసెస్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగు చేయడంలో జిల్లా 5వ స్థానంలో ఉందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 80 పాలీ హౌస్ ల యూనిట్ లను గుర్తించడం జరిగిందని, ఇప్పటివరకు 44 యూనిట్లు పూర్తి అయ్యాయని ఆయన అన్నారు. ప్రభుత్వం ఉల్లిగడ్డ గిడ్డంగి, వర్మి కంపోస్ట్ యూనిట్, శాశ్వత పందిరీలు, పట్టు పరిశ్రమ, మల్బరీ ప్లాంటేషన్ కు కూడా ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని కలెక్టర్ తెలిపారు. హైదరాబాద్ నగరం అతి సమీపంలో ఉన్నందున పండ్లు, కూరగాయలు, పూలు మార్కెటింగ్ చేసుకునేందుకు మంచి అవకాశం ఉందని దీని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపించాలని కలెక్టర్ తెలిపారు. రైతుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు సాగు చేసుకునే విధంగా శిక్షణలు ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. మూడు నెలలకు ఒకసారి భాగస్వామ్య శాఖలతో సమావేశాలు నిర్వహించాలని అదేవిధంగా నియోజకవర్గస్థాయిలో సమావేశాలు నిర్వహించి నూతన సాంకేతిక పద్ధతిలో పంట ఉత్పత్తిని ఎలా పెంచాలి అనే దానిపై రైతులకు ఎప్పటికప్పుడు పలు సూచనలు సలహాలు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ అధికారులను సూచించారు ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన వన పట్టు పరిశ్రమల అధికారి సత్తార్, వ్యవసాయ శాఖ అధికారి రాజారత్నం, జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి కమలాకర్ రెడ్డి, రైతులు, వివిధ విభాగాల అధికారులు ప్రతినిధులు పాల్గొన్నారు

## ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు



**రామారెడ్డి రాజముద్ర న్యూస్:** రామారెడ్డి మండలం గోకుల్ తాండ గ్రామ పంచాయతీ లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిధి గా జెడ్పి సీఈవో చందర్ నాయక్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటడం జరిగింది, గ్రామస్థుల చేత పర్యావరణ ప్రతిజ్ఞ చేయించడం జరిగింది, అలాగే చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడాలి ఈ సందర్భంగా తెలిపారు,ఈ కార్యక్రమం లో సర్పంచ్ మోహన్ నాయక్, ఉపసర్పంచ్ మంజుల, ఎంపీడీఓ నాగేశ్వర్ , mpo తిరుపతి , పిఎస్ రాజేష్, వార్డు సభ్యులు రమేష్,, రవి, శంకు గంగారాం, సునీత, రవి , ఫీల్డ్ అసిస్టెంట్ పరశురాం గ్రామస్తులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా పరిధిలో అడ్డగోలుగా రక్తపరీక్ష కేంద్రాలు

**సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ కరువు**

**వికారాబాద్, రాజముద్ర న్యూస్ :** వికారాబాద్ జిల్లాలో అనేక ప్రైవేట్ రక్తపరీక్ష కేంద్రాలు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. అర్హత కలిగిన సాంకేతిక సిబ్బంది లేకుండా అవసరమైన అనుమతులు నాణ్యత ప్రమాణాలు పాటించకుండా రక్త పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల వల్ల రోగులకు తప్పుదారి పట్టించే అవకాశం ఉందని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రజల ఆరోగ్యం ప్రమాదంలో పడే అవకాశం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. జిల్లాలో పనిచేస్తున్న అన్ని రక్తపరీక్ష కేంద్రాలు, డయాగ్నస్టిక్ ల్యాబ్‌లపై సంబంధిత శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న కేంద్రాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల ఆరోగ్య భద్రతను దృష్టిలో ఉంచుకొని సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, అక్రమంగా నడుస్తున్న కేంద్రాలను గుర్తించి చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు. జిల్లా పరిధిలో రక్తపరీక్ష కేంద్రాలు ఆస్పత్రులతోపాటు పెరుగుతూ వస్తున్న నేపథ్యంలో రక్తపరీక్ష కేంద్రాల్లో ఎక్కువ ట్రైనింగ్ చేసే వారిని చేర్చుకొని నాణ్యత ప్రమాణాలను పాటించకుండా ఇష్టానుసారంగా రక్తపరీక్ష కేంద్రలను నడిపిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వికారాబాద్ జిల్లా కేంద్రంలోనే కాకుండా మండల స్థాయిలో కూడా రక్త పరీక్ష కేంద్రాలు వెలుస్తున్నాయన్నారు. సంబంధిత శాఖ అధికారుల పర్యవేక్షణ లేక డయాగ్నస్టిక్ సెంటర్లలో అనుభవం ఉన్న వారు పనిచేస్తున్నారా లేదా అనేది కూడా పర్యవేక్షించాలని ప్రజలు పేర్కొన్నారు. సరైన విధంగా రక్త పరీక్షలు నిర్వహించకపోతే ప్రజల ప్రాణాలకు ముప్పు ఉండే అవకాశం ఉందని వీటిపైన సంబంధిత శాఖ అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆరోపిస్తున్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం.. అమ్మగూడెంలో అవగాహన సదస్సు

**పర్యావరణ దినోత్సవం సందర్భంగా మధుకాన్ షుగర్ ఇండస్ట్రీస్‌లో వృక్షారోపణ**



**ఖమ్మం, రాజముద్ర న్యూస్:** నేలకొండపల్లి, ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అమ్మగూడెం గ్రామంలో "ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణం" అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి కొత్తగూడెం పర్యావరణ ఇంజనీర్ శ్రీ రవీంద్ర ఆధ్వర్యంలో, స్థానిక మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ సహకారంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పర్యావరణ ఇంజనీర్ రవీంద్ర మాట్లాడుతూ, ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించారు. ప్లాస్టిక్ కారణంగా పర్యావరణ కాలుష్యం పెరిగి మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని, క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ప్రజలంతా ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను ఉపయోగించాలని సూచించారు. అనంతరం మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ ఆవరణలో వృక్షారోపణ కార్యక్రమాన్ని చేపట్టారు. సంస్థ ఉద్యోగులు, కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మధుకాన్ షుగర్ అండ్ పవర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ సంస్థ ఏవీపీ వై. కోటయ్య, ఇతర అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది, అమ్మగూడెం గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## దరఖాస్తుల ఆహ్వానం



**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** శంకరపట్నం మండలంలో నూతనంగా మంజూరైన నాలుగు పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో బోధకులు, ఆయాల నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు మండల విద్యాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. బోధకుల పోస్టులకు ఇంటర్మీడియట్, ఆయా పోస్టులకు 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు. బోధకులకు నెలకు రూ.8 వేల, ఆయాలకు రూ.6 వేల గౌరవ వేతనం అందజేస్తారు. అభ్యర్థుల వయస్సు 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి. స్థానికులకు ప్రాధాన్యం ఉంటుంది. దరఖాస్తులను జూన్ 5 నుంచి 8వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఎంఈఓ కార్యాలయం, శంకరపట్నంలో సమర్పించాలని సూచించారు. ఎరడపల్లి, చింతపల్లి, రాజాపూర్, కరీంపేట పాఠశాలల్లో ఈ నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

# పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

- నాగారం డివిజన్ రాంపల్లి భరత్ నగర్ లో మొక్కలు నాటిన బీజేపీ నాయకులు..
- ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి..





**నాగారం, రాజముద్ర న్యూస్:** మేడ్చల్ రూరల్ జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నాగారం డివిజన్ బీజేపీ అధ్యక్షులు కొండబోయిన నాగరాజ్ యాదవ్ పర్యవేక్షణలో, భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం విజయవంతంగా 12 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా, అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని "ఏక్ పేడ్ మా కే నామ్" కార్యక్రమంలో భాగంగా నాగారం డివిజన్ రాంపల్లి భరత్ నగర్ లో మొక్కలు నాటడం జరిగింది. శుక్రవారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి హాజరై మొక్కలు నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకుని భారతదేశాన్ని అన్ని విధాలుగా ముందుకు తీసుకెళ్తోందని తెలియజేశారు. ఎన్నో చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుంటూ, సుపరిపాలన, ప్రజల శ్రేయస్సు, దేశ భద్రత, దేశ సమైక్యతకు ఎల్లప్పుడూ ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తల్లి పేరు మీద ఒక మొక్క నాటాలని పిలుపునిచ్చారని, అలాగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం పురస్కరించుకొని పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడితే ఆ పర్యావరణం మనకు ఎల్లప్పుడూ అనుకూలంగా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలని, చెట్లను పెంచాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్ఫూర్తితో తమ పుట్టినరోజు, పెళ్లిరోజు సందర్భంగా చెట్లు నాటి, ఆ చెట్లను సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సింగిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్ సెల్ కో–కన్వీనర్ మునిగంటి సురేష్, మేడ్చల్ రూరల్ జిల్లా ప్రధాన కార్యదర్శులు గోనే శ్రీనివాస్, బుధవరం లక్ష్మి , జిల్లా ఉపాధ్యక్షులు గణపురం శ్యాంసుందర్ శర్మ, బొమ్మిడి బుచ్చిరెడ్డి , మాజీ ఎంపీటీసీ బలరాం, మాజీ కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్ గౌడ్, రామారం మహేందర్ గౌడ్ నక్క కిషోర్ గౌడ్, జిల్లా కార్యదర్శి బోడ శ్రీనివాస్ రావు, కీసర మండల డివిజన్ అధ్యక్షులు కోల బాలరాజ్ యాదవ్, నాగారం డివిజన్ ప్రధాన కార్యదర్శులు మామిడి జంగారెడ్డి, పోతంశెట్టి వెంకటేశ్వరరావు, ఏనుగు మహేందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు వల్లల శ్రీనివాస్ గౌడ్, రామారం గిరి గౌడ్, కార్యదర్శులు సురేందర్ రెడ్డి, సతీష్ రెడ్డి, భరత్‌నగర్ కాలనీ అధ్యక్షులు మల్లారెడ్డి,బీజేపీ నాయకులు, వివిధ కాలనీల అసోసియేషన్ సభ్యులు పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమంలో పాలుపంచుకున్నారు.

## జిల్లా కోర్టు ఆవరణలో మొక్కలు నాటిన స్పెషల్ జడ్జ్ ఎం నాగరాజు ఎస్పీ స్నేహం మెహ్రా



**వికారాబాద్, రాజముద్ర న్యూస్:** ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అటవీ శాఖ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ ఎం. నాగరాజుతో కలిసి జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా పాల్గొని మొక్కలు మొక్కలు నాటడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జ్ ఎం. నాగరాజు మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యం గ్లోబల్ వార్మింగ్ వంటి సవాళ్లను ఎదుర్కోవడానికి, రాబోయే తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడానికి పెద్ద ఎత్తున మొక్కలు నాటడం వాటిని సంరక్షించడం అత్యంత ఆవశ్యకమని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను జాగ్రత్తగా కాపాడుకుంటూ వృక్షాలుగా మార్చాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ జీవితంలో కనీసం ఒక మొక్కనైనా నాటి, దానిని బాధ్యతగా పెంచాలని ఆమె కోరారు. పోలీస్ శాఖ తరఫున పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు పూర్తి మద్దతు ఉంటుందని, జిల్లా వ్యాప్తంగా హరితహారాన్ని పర్యావరణ చైతన్యాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన ఇతర న్యాయమూర్తులు అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్మీలో ఎంపికైన రవితేజకు ముదిరాజ్ కులస్తుల సన్మానం



**రాజముద్ర న్యూస్, గన్నేరువరం:** గన్నేరువరం మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామానికి చొక్కాల పల్లి చెందిన చోక్కల రవితేజ ముదిరాజ్ బిడ్డ ఆర్మీకి ఎంపిక అయినందున శుక్రవారం ముదిరాజ్ కుల పెద్ద మనుషుల సమక్షంలో అతనికి శాలువా తొ సత్కారం చేయడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబానికి నుండి వచ్చినటువంటి రవితేజ అనేక కష్టాలు నష్టాలు ఎదుర్కొని పట్టుదలతో ఆర్మీ కి ఎంపీక ముదిరాజ్ కులానికి గర్వకారణం అన్నారు దేశం కోసం యుద్ధచేయడానికి ఎంపిక అయిన రవితేజ మా గ్రామం కావడం మాకు గర్వకారణం భవిష్యత్తు లో ఉన్నత గా ఎదుగాలని అన్నారు రవితేజ ను ఆదర్శంగా తీసుకోవాలని ముదిరాజ్ కుటుంబాలకు ఆదర్శమని అన్నారు ఈ కార్యక్రమం లో ముదిరాజ్ కుల పెద్దమనిషి చొక్కాల కొండయ్య మెంబెర్స్ చొక్కాల తిరుపతి చొక్కాల శ్రీనివాస్ సంఘం సభ్యులు బల్ల సంతు చొక్కల హరీష్ చొక్కాల కొమురయ్య చొక్కాల లక్సమాన్ చొక్కాల యాదగిరి బల్ల రాజు గూడెల్లి మల్లేశం గూడెల్లి రాములు చొక్కాల బాలయ్య తదితరులు పాల్గొన్నారు

## ఆర్మీలో ఉద్యోగాలు సాధించిన తేజస్ విద్యార్థులు



**రాజముద్ర న్యూస్, కరీంనగర్ :** కొత్తపల్లి పట్టణంలోని తేజస్ జూనియర్ కాలేజ్, తేజస్ డిఫెన్స్ అకాడమీ విద్యార్థులు 156 మంది ఆర్మీలో, ముగ్గురు ఎయిర్‌ఫోర్స్లో అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికైనట్లు కాలేజ్ చైర్మన్ సీహెచ్.సతీష్రావు తెలిపారు. కాలేజీలో శుక్రవారం నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఇండియన్ ఆర్మీ జీడీ ఉద్యోగాలకు -131 మంది, ట్రేడ్మన్ ఉద్యోగాలకు12 మంది, టెక్నికల్ ఉద్యోగాలకు 13 మంది, ఒకరు క్లర్క్, ఇండియర్ ఎయిర్‌ఫోర్స్ నాన్ టెక్నికల్ ఉద్యోగాలకు ముగ్గురు ఎంపికైనట్లు వివరించారు. 2025 జూన్లో హన్మకొండలో నిర్వహించిన ఆర్మీ ఓపెన్ ర్యాలీలో మెరిట్ సాధించి 2026 మే 31న విడుదలైన ఫలితాల్లో అగ్నివీరులుగా ఉద్యోగాలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను ఈ సందర్భంగా ఆయన శాలువా, మెమొంటో ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో లెక్చరర్స్, పేరెంట్స్ పాల్గొన్నారు.

# జూన్ 8న ముఖ్యమంత్రి పర్యటనను జయప్రదం చేయండి

- మియాపూర్‌లో రూ.161 కోట్ల వ్యయంతో అభివృద్ధి కార్యక్రమాలకు సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం
- డీసీసీ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్



**మీయపూర్,రాజముద్ర న్యూస్:** ఈ నెల 8వ తేదీన సాయంత్రం 5:00 గంటలకు మియాపూర్‌లో రూ.161 కోట్ల వ్యయంతో నిర్మించనున్న సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి భూమిపూజతో పాటు పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి హాజరై ప్రారంభిస్తారు. శుక్రవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను జిల్లా కాంగ్రెస్ నాయకులు మియాపూర్‌లో పరిశీలించారు. అనంతరం మేడ్చల్ జిల్లా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ నూతన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన జరగనున్నట్లు తెలిపారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రజాప్రతినిధులు,మాజీ ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరేకపుడి గాంధీ,రాష్ట్ర కార్పోరేషన్ ఛైర్మన్లు చల్ల నర్సింహా రెడ్డి,బండి రమేష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ కోలన్ హనుమంత్ రెడ్డి,శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి జగదీశ్వర్, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# గన్నేరువరం లో బిజెపి ఎస్ ఐ ఆర్ సమావేశం పార్టీ బలోపేతమే లక్ష్యం

**రాజముద్ర న్యూస్, గన్నేరువరం:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు గన్నేరువరం మండల కేంద్రం లో శుక్రవారం జరిగిన ఎస్ ఐ ఆర్ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇనుకొండ నాగేశ్వర్ రెడ్డి ప్రధాన వక్తగా పాల్గొని భూత్ లెవెల్ ఏజెంట్ల విధుల గురించి క్లుప్తంగా ప్రసంగించడం జరిగింది. ఈ సమావేశం లో జిల్లా ఉపాధ్యక్షులు రంగు భాస్కరాచారి ఓటర్ల జాబితా సమగ్ర సవరణ దాని ప్రాముఖ్యత, గురించి వివరించారు ఈ కార్యక్రమం లో గునుకుల కొండాపూర్ సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ మండల జనరల్ సెక్రెటరీలు పుల్లెల రాము గుమ్మడి సురేందర్ రెడ్డి మండల బిజెపి ఉపాధ్యక్షులు కాంతాల శ్రీనివాసరెడ్డి గాలిపెల్లి శంకర్ మండల కార్యదర్శులు సిహెచ్ చంద్రయ్య బూట్ల సంపత్ మండల కార్యవర్గ సభ్యులు



గూడూరు జగన్ కర్ర అనుషా రెడ్డి నాయకులు మచ్చ బాల్రాజ్ విలాసాగరం రామచంద్రం అటికం రామచంద్రం పుల్లెల జగన్ మోహన్ గాద నరసింహస్వామి కొంకట్ రవి రంగనవేని కుమార్ మచ్చ సాయి చుక్కల లక్ష్మయ్య గీకురు ఆంజనేయులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# కామెర్ల కేసులు వైరల్ హెపటైటిస్-ఏగా నిర్ధారణ

**రాజముద్ర న్యూస్, శంకరపట్నం:** శంకరపట్నం మండలంలోని కన్నాపూర్, రాజాపూర్, చింతలపల్లి, మొలంగూర్, లింగాపూర్, మెట్పల్లి గ్రామాల్లో నమోదైన కామెర్ల వ్యాధి కేసులను సిరిసిల్ల వైద్య కళాశాల వైద్య బృందం పరిశీలించింది. డాక్టర్ జ్యోతి (కమ్యూనిటీ మెడిసిన్), డాక్టర్ నిఖిల్ (పిల్లల వైద్య నిపుణులు), డాక్టర్ స్తుతి (జనరల్ మెడిసిన్), డాక్టర్ మహేశ్వర్ రెడ్డి (మైక్రో బయాలజిస్ట్) బాధితులను ప్రత్యక్షంగా సందర్శించి వివరాలు సేకరించారు. ఓపీ చీటీలు, ఆస్పత్రిలో చేరిన వారి కేస్ షీట్లు, వ్యక్తిగత సమాచారం, ఆహారపు అలవాట్లు, ప్రయాణాల వివరాలను పరిశీలించిన అనంతరం మండలంలో నమోదైన కామెర్ల వ్యాధి వైరల్ హెపటైటిస్–ఏ అని వైద్య బృందం నిర్ధారించింది. ఈ వ్యాధి ప్రాణాంతకం కాదని, బాధితుల్లో సుమారు 20 రోజుల వరకు కళ్లు, శరీరంలో పసుపు రంగు లక్షణాలు కనిపించే అవకాశం ఉంటుందని వివరించింది.కొత్తగా



జ్వరం లేదా కామెర్ల లక్షణాలు కనిపించిన వారు సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీబీపీ, ఎస్. బిలిరుబిన్ పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రవణ్ కుమార్ సూచించారు. వైద్యుల సలహా మేరకు మందులు తీసుకుంటూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని మండల ప్రజలకు తెలిపారు.



# టీ20 వరల్డ్‌కప్ గెలిపించిన కెప్టెన్‌కు షాక్..?

## సూర్యకుమార్ స్థానంలో శ్రేయస్ అయ్యర్?

**ముంబై, జూన్ 5 :** ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన తర్వాత భారత క్రికెట్ వర్గాల్లో ఒక ఆసక్తికర చర్చ మొదలైంది. టీమిండియా టీ20 కెప్టెన్‌గా విజయవంతంగా కొనసాగుతున్న సూర్యకుమార్ యాదవ్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించే అవకాశాలపై వార్తలు వినిపిస్తున్నాయి. ఈ ప్రచారం ప్రస్తుతం అభిమానుల్లో చర్చనీయాంశంగా మారింది. రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన తర్వాత టీ20 జట్టు పగ్గాలు చేపట్టిన సూర్యకుమార్ యాదవ్ తన నాయకత్వంతో జట్టుకు వరుస విజయాలు అందించాడు. ఆయన కెప్టెన్సీలో భారత్ వరుసగా ఎనిమిది ద్వైపాక్షిక సిరీస్‌లను గెలుచుకోవడమే కాకుండా, 2025 ఆసియా కప్ మరియు 2026 టీ20 వరల్డ్‌కప్‌లను కైవసం చేసుకుని ప్రపంచ క్రికెట్‌లో తన ముద్ర వేసింది. ఇలాంటి విజయాల తర్వాత కూడా కెప్టెన్సీ మార్పుపై వార్తలు రావడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. గతంలో కూడా ఐసీసీ ట్రోఫీలు గెలిపించిన కెప్టెన్ల విషయంలో భారత క్రికెట్‌లో ఇలాంటి మార్పులు చోటుచేసుకున్నాయి. రోహిత్ శర్మ వన్డే జట్టుకు అద్భుత విజయాలు అందించినప్పటికీ, భవిష్యత్ ప్రణాళికల దృష్ట్యా నాయకత్వ బాధ్యతలను యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. ఇప్పుడు అదే తరహా వ్యూహాన్ని టీ20 ఫార్మాట్‌లో కూడా అమలు చేసే ఆలోచనలో బీసీసీఐ ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. జట్టు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువ నాయకత్వాన్ని సిద్ధం చేయాలనే లక్ష్యంతో కొత్త కెప్టెన్ ఎంపికపై చర్చలు జరుగుతున్నాయని సమాచారం. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో తన నాయకత్వ ప్రతిభతో ఆకట్టుకున్న శ్రేయస్ అయ్యర్ పేరు బలంగా వినిపిస్తోంది. పంజాబ్ కింగ్స్ జట్టును సమర్థవంతంగా నడిపించి విజయాలు అందించిన అయ్యర్, ప్రస్తుతం టీ20 కెప్టెన్సీ రేసులో ముందంజలో ఉన్నట్లు క్రికెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

అయితే ఈ విషయంపై భారత క్రికెట్ నియంత్రణ మండలి నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. ప్రస్తుతం వినిపిస్తున్న వార్తలు కేవలం ప్రచారంగానే ఉన్నాయి. ఒకవేళ సూర్యకుమార్ యాదవ్ స్థానంలో కొత్త కెప్టెన్‌ను ఎంపిక చేస్తే, అది భారత జట్టు భవిష్యత్ వ్యూహంలో కీలక మార్పుగా భావించబడుతుంది. మరోవైపు వరుస ఐసీసీ ట్రోఫీలు అందించిన కెప్టెన్‌ను మార్చడం సరైన నిర్ణయమేనా అనే అంశంపై అభిమానులు, మాజీ క్రికెటర్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. బీసీసీఐ నుంచి అధికారిక ప్రకటన వచ్చే వరకు ఈ చర్చ కొనసాగడం ఖాయంగా కనిపిస్తోంది.




# గుకేశ్‌పై ప్రజ్ఞానంద ప్రతీకార విజయం

**ఓస్లో, జూన్ 5 :** నార్వే చెస్ టోర్నీలో భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్. ప్రజ్ఞానంద అద్భుత ప్రదర్శనతో టైటిల్ రేసులోకి దూసుకెళ్లాడు. కీలక మ్యాచ్‌లో ప్రపంచ చాంపియన్, భారత స్టార్ చెస్ క్రీడాకారుడు డీ గుకేశ్‌పై సంచలన విజయం సాధించి తన సత్తా చాటాడు. ఈ మ్యాచ్‌లో తెలుపు పావులతో ఆడిన ప్రజ్ఞానంద కేవలం 34 ఎత్తుల్లోనే గుకేశ్‌ను ఓడించి అందరి దృష్టిని ఆకర్షించాడు. రెండు రోజుల క్రితమే తన 20వ పుట్టినరోజు జరుపుకున్న గుకేశ్‌కు ఇది ఊహించని ఎదురుదెబ్బగా మారింది. ఈ విజయానికి మరో ప్రత్యేకత కూడా ఉంది. ఇదే టోర్నీలో నాలుగో రౌండ్‌లో గుకేశ్ చేతిలో ప్రజ్ఞానంద ఓటమి పాలయ్యాడు. తాజాగా అదే ప్రత్యర్థిపై గెలిచి ప్రతీకారం తీర్చుకున్నాడు. అంతేకాకుండా వరుసగా మూడు విజయాలు నమోదు చేసి టైటిల్ పోరులో బలమైన పోటీదారుడిగా నిలిచాడు. మ్యాచ్ అనంతరం ప్రజ్ఞానంద మాట్లాడుతూ, "మూడు రోజుల క్రితం వరకు నేను టైటిల్ రేసుకు దూరంగా ఉన్నాను. ఇప్పుడు మళ్లీ పోటీలోకి వచ్చాను. వరుస విజయాలతో ఆత్మవిశ్వాసం పెరిగింది" అని పేర్కొన్నాడు. గత ఏడాది నార్వే చెస్ టోర్నీలో డీ గుకేశ్, ప్రపంచ మాజీ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ మధ్య పోటీ ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అయితే ఈ ఏడాది కార్ల్‌సన్ ఆశించిన స్థాయిలో ప్రదర్శన చేయలేకపోవడంతో టైటిల్ పోరు మరింత ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం పాయింట్ల పట్టికలో అమెరికా గ్రాండ్‌మాస్టర్ వెస్లీ సో 15.5 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ప్రజ్ఞానంద 15 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి గట్టి పోటీ ఇస్తున్నాడు. మూడో స్థానంలో అలిరెజా ఫిరౌజా 14.5 పాయింట్లతో కొనసాగుతున్నాడు. గుకేశ్ 8 పాయింట్లతో పట్టికలో వెనుకబడి ఉన్నాడు. మిగిలిన రౌండ్లలో కూడా ఇదే జోరు కొనసాగిస్తే ప్రజ్ఞానంద నార్వే చెస్ టైటిల్‌ను కైవసం చేసుకునే అవకాశాలు మెరుగ్గా కనిపిస్తున్నాయి. భారత చెస్ అభిమానులు ఇప్పుడు అతని తదుపరి మ్యాచ్‌లపై ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# అఫ్గానిస్తాన్ టెస్టుకు భారత్ సిద్ధం



**న్యూఢిల్లీ, జూన్ 5 :** ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన అనంతరం భారత జట్టు మళ్లీ టెస్టు క్రికెట్‌పై దృష్టి సారించింది. అఫ్గానిస్తాన్‌తో జరగనున్న టెస్టు మ్యాచ్‌కు సంబంధించి జట్టు కూర్పుపై ఆసక్తికర చర్చలు సాగుతున్నాయి. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మార్గదర్శకత్వంలో యువ ఆటగాళ్లకు అవకాశాలు లభించే అవకాశం ఉందని క్రీడా వర్గాలు భావిస్తున్నాయి. ఇటీవలి కాలంలో పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మంచి ప్రదర్శనలు కనబరిచిన శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో భారత జట్టు బరిలోకి దిగే అవకాశమున్నట్లు ప్రచారం జరుగుతోంది. టెస్టు క్రికెట్‌లో మళ్లీ ఆధిపత్యం చాటుకోవాలనే లక్ష్యంతో జట్టు సన్నద్ధమవుతోంది.

### ఓపెనింగ్ జోడీగా గిల్-జైస్వాల్

ఈ మ్యాచ్‌లో భారత ఇన్నింగ్స్‌ను కెప్టెన్ శుభ్‌మన్ గిల్, యశస్వి జైస్వాల్ ప్రారంభించే అవకాశం ఉందని తెలుస్తోంది. గిల్ పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌తో అందుబాటులో ఉండటంతో అతడే ఓపెనర్‌గా బరిలోకి దిగే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. జైస్వాల్‌తో కలిసి మంచి ఆరంభం అందిస్తే భారత జట్టుకు భారీ స్కోరు నమోదు చేసే అవకాశం ఉంటుంది.

### మూడో స్థానంలో దేవదత్ పడిక్కల్


ఒకప్పుడు భారత టెస్టు జట్టులో మూడో స్థానానికి ప్రతీకగా నిలిచిన చేతేశ్వర్ పుజారా తర్వాత ఆ స్థానాన్ని స్థిరంగా భర్తీ చేసే ఆటగాడి కోసం జట్టు ఎదురుచూస్తోంది. ఈ నేపథ్యంలో దేవదత్ పడిక్కల్‌కు అవకాశం దక్కే అవకాశముందని వార్తలు వినిపిస్తున్నాయి. దేశవాళీ క్రికెట్‌లో అద్భుత ఫామ్ కనబరిచిన పడిక్కల్ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని టెస్టు జట్టులో తన స్థానాన్ని బలపరుచుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

### నాలుగో స్థానంలో కేఎల్ రాహుల్

సీనియర్ బ్యాటర్ కేఎల్ రాహుల్ నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. అనుభవం, ఒత్తిడిని ఎదుర్కొనే సామర్థ్యం కారణంగా జట్టు యాజమాన్యం రాహుల్‌పై విశ్వాసం ఉంచినట్లు తెలుస్తోంది. అదే సమయంలో వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్ ఎంపికపై కూడా చర్చ కొనసాగుతోంది. తుది జట్టు ప్రకటన వెలువడిన తర్వాతే ఈ అంశంపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. యువ ఆటగాళు,, అనుభవజ్ఞుల సమతుల్యతతో అఫ్గానిస్తాన్‌పై విజయమే లక్ష్యంగా భారత జట్టు బరిలోకి దిగనుంది. అయితే తుది జట్టు వివరాలు అధికారిక ప్రకటన తర్వాతే ఖరారు కానున్నాయి.

# సాయి సుదర్శన్‌కే తొలి ప్రాధాన్యత

## గంభీర్ కీలక వ్యాఖ్యలు



**న్యూఢిల్లీ, జూన్ 5 :** భారత క్రికెట్ జట్టు ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ మరోసారి తన స్పష్టమైన అభిప్రాయాలతో వార్తల్లో నిలిచారు. అఫ్ఘనిస్థాన్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు ముందు మీడియాతో మాట్లాడిన గంభీర్.. టెస్టు జట్టులో మూడో స్థానానికి సాయి సుదర్శన్ కే తొలి ప్రాధాన్యత ఇస్తామని వెల్లడించారు. దేవదత్ పడిక్కల్ కంటే ముందు సుదర్శన్‌కు అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. గంభీర్ మాట్లాడుతూ, "సాయి సుదర్శన్‌కు గతంలో సరైన అవకాశాలు రాలేదు. అతనికి పూర్తి న్యాయం జరగలేదు. కొద్ది మ్యాచ్‌ల ప్రదర్శన ఆధారంగా ఆటగాడి సామర్థ్యాన్ని అంచనా వేయడం సరైంది కాదు. ఇటీవల ఐపీఎల్‌లో అతను 700కు పైగా పరుగులు చేసి అద్భుత ఫామ్‌లో ఉన్నాడు. అందుకే అతడికి మరిన్ని అవకాశాలు ఇవ్వాలి" అని పేర్కొన్నారు.

### శ్రీలంక పర్యటనకు నలుగురు స్పిన్నర్లు

రాబోయే శ్రీలంక పర్యటన కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు గంభీర్ వెల్లడించారు. ఈ పర్యటనకు నలుగురు స్పిన్నర్లను తీసుకెళ్లాలని భావిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం నాలుగో స్పిన్నర్ స్థానం కోసం మధ్య పోటీ నెలకొన్నదని తెలిపారు. "అఫ్ఘనిస్థాన్‌తో జరిగే మ్యాచ్‌లో వారి ప్రదర్శనను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటాం. ఇద్దరి బౌలింగ్ శైలిలో కొన్ని పోలికలు ఉన్నప్పటికీ, ప్రత్యేకతలు కూడా ఉన్నాయి" అని గంభీర్ వివరించారు.

### రిషభ్ పంత్‌కు గంభీర్ సూచనలు

టెస్టు జట్టు వైస్ కెప్టెన్సీ కోల్పోయిన రిషభ్ పంత్ గురించి కూడా గంభీర్ స్పందించారు. పంత్ సహజసిద్ధమైన దూకుడు ఆటను మార్చుకోవాల్సిన అవసరం లేదని, అయితే మ్యాచ్ పరిస్థితులకు అనుగుణంగా ఆడటం నేర్చుకోవాలని సూచించారు. "రిషభ్ పంత్ ప్రతిభపై ఎలాంటి సందేహం లేదు. కానీ అంతర్జాతీయ క్రికెట్‌లో పరిస్థితులను అర్థం చేసుకుని ఆడటం చాలా ముఖ్యం. ఆటలో మరింత పరిణతి ప్రదర్శించాలి. అతడికి మా పూర్తి మద్దతు ఎప్పుడూ ఉంటుంది" అని గంభీర్ అన్నారు.

### జట్టు భవిష్యత్తుపై దృష్టి

భారత జట్టు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పించడమే తమ లక్ష్యమని గంభీర్ స్పష్టం చేశారు. అవసరమైతే వన్డే జట్టులో రెగ్యులర్‌గా ఆడే ఆటగాళ్లను కూడా టెస్టు జట్టులోకి తీసుకునే అవకాశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. అఫ్ఘనిస్థాన్‌తో జరిగే టెస్టు మ్యాచ్ ద్వారా పలువురు యువ ఆటగాళ్లు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం పొందనున్నారు. దీంతో తుది జట్టులో ఎవరికీ చోటు దక్కుతుందనే అంశం ఆసక్తికరంగా మారింది.

# శ్రీలంక చేరుకున్న భారత్ 'ఏ' జట్టు..



**దంబుల్లా, జూన్ 5 :** శ్రీలంకలో జరగనున్న ముక్కోణపు వన్డే సిరీస్ కోసం తిలక్ వర్మ సారథ్యంలోని భారత్ 'ఏ' జట్టు లంక గడ్డపై అడుగుపెట్టింది. జూన్ 9 నుంచి 21 వరకు దంబుల్లాలోని రంగిరి అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం వేదికగా ఈ ప్రతిష్టాత్మక టోర్నీ జరగనుంది. ఈ సిరీస్‌లో భారత్ 'ఏ', శ్రీలంక 'ఏ', అఫ్ఘనిస్థాన్ 'ఏ' జట్లు పరస్పరం తలపడనున్నాయి. భవి ష్యత్ భారత జట్టుకు ఎంపికయ్యే అవకాశమున్న యువ ఆటగాళ్ల ప్రతిభను పరీక్షించే వేదికగా ఈ టోర్నీ నిలవనుంది. ఇటీవల ముగిసిన ఐపీఎల్‌లో సంచలన ప్రదర్శనతో అందరి దృష్టిని ఆకర్షించిన 15 ఏళ్ల యువ బ్యాటర్ వైభవ్ సూర్యవంశీ ఈ టోర్నీలో ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాడు. ఐపీఎల్‌లో పరుగుల వరద పారించిన వైభవ్‌పై అభిమానులతో పాటు సెలెక్టర్ల దృష్టి కూడా కేంద్రీకృతమైంది. భారత్ 'ఏ' జట్టు శ్రీలంక చేరుకున్న విషయాన్ని శ్రీలంక క్రికెట్ బోర్డు సామాజిక మాధ్యమాల ద్వారా వెల్లడించింది. తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్, వైభవ్ సూర్యవంశీ తదితర ఆటగాళ్లు శ్రీలంక చేరుకున్న ఫొటోలను పంచుకుంది. ఉత్కంఠభరితంగా సాగే ఈ టోర్నీలో భారత యువ ఆటగాళ్లు తమ ప్రతిభను చాటుకునేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొంది. ఈ పర్యటనకు ముందు భారత జట్టులో రెండు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. తొడ కండరాల గాయంతో రియాన్ పరాగ్ సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో రుతురాజ్ గైక్వాడ్‌ను వైస్ కెప్టెన్‌గా నియమించారు. ప్రస్తుతం రియాన్ పరాగ్ బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు హర్ష్ దూబేకు భారత సీనియర్ జట్టు నుంచి పిలుపు రావడంతో అతని స్థానంలో అనుకుల్ రాయ్‌ను జట్టులోకి ఎంపిక చేశారు.

### భారత్ 'ఏ' జట్టు:

తిలక్ వర్మ (కెప్టెన్), రుతురాజ్ గైక్వాడ్ (వైస్ కెప్టెన్), ప్రియాన్ష్ ఆర్య, వైభవ్ సూర్యవంశీ, ఆయుష్ బదోని, నిశాంత్ సింధు, సూర్యాంశ్ షెడ్గే, ప్రభ్‌సిమ్రన్ సింగ్ (వికెట్ కీపర్), కుమార్ కుశాగ్ర (వికెట్ కీపర్), విప్రాజ్ నిగమ్, యశ్ ఠాకూర్, యుధ్వీర్ సింగ్, అన్షుల్ కంబోజ్, అర్షద్ ఖాన్, అనుకుల్ రాయ్. ఈ టోర్నీలో మెరుగైన ప్రదర్శన కనబరిచే ఆటగాళ్లకు త్వరలోనే భారత సీనియర్ జట్టులో అవకాశాలు లభించే అవకాశం ఉండటంతో ప్రతి మ్యాచ్‌కు ప్రాధాన్యం ఏర్పడింది. ముఖ్యంగా వైభవ్ సూర్యవంశీ, తిలక్ వర్మ, రుతురాజ్ గైక్వాడ్ ప్రదర్శనలపై అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# సెర్బియాపై మెక్సికో ఘన విజయం

**మెక్సికో సిటీ, జూన్ 5 :** ఫీఫా ప్రపంచకప్-2026 సన్నాహక మ్యాచ్‌లో మెక్సికో జట్టు అద్భుత ప్రదర్శనతో సెర్బియాపై 5-1 తేడాతో ఘన విజయం సాధించింది. సొంత మైదానంలో అభిమానుల మద్దతుతో బరిలోకి దిగిన మెక్సికో, ప్రారంభంలో వెనుకబడినప్పటికీ ఆ తర్వాత పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి విజయం ఖాయం చేసుకుంది. మ్యాచ్ 19వ నిమిషంలో సెర్బియా ఆటగాడు పెటార్ స్టానిక్ గోల్ నమోదు చేసి తన జట్టుకు ఆధిక్యం అందించాడు. అయితే మెక్సికో ఆటగాళ్లు ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా దూకుడుగా ఆడారు. 34వ నిమిషంలో జోహాన్ వాస్క్వెజ్ అద్భుత హెడర్‌తో గోల్ చేసి స్కోరును 1-1తో సమం చేశాడు. మొదటి అర్ధభాగం ముగిసే సమయానికి సెర్బియా ఆటగాళ్ల పొరపాటు మెక్సికోకు వరంగా మారింది. సెల్ఫ్ గోల్ కారణంగా మెక్సికో 2-1 ఆధిక్యంలోకి వెళ్లింది. ఈ గోల్ మ్యాచ్ మలుపు తిప్పిన కీలక ఘట్టంగా నిలిచింది. రెండో అర్ధభాగంలో మెక్సికో మరింత దూకుడుగా ఆడింది. 57వ నిమిషంలో రౌల్ జిమెనెజ్ గోల్ చేసి ఆధిక్యాన్ని 3-1కు పెంచాడు. అనంతరం 72వ నిమిషంలో సెర్బియా మరోసారి సెల్ఫ్ గోల్ చేసుకోవడంతో స్కోరు 4-1గా మారింది. మ్యాచ్ చివరి దశలో లూయిస్ చావెజ్ అద్భుతమైన లాంగ్ రేంజ్ షాట్‌తో మరో గోల్ సాధించి మెక్సికో విజయంలో తన ముద్ర వేశాడు. దీంతో మెక్సికో 5-1 తేడాతో ఘన విజయం నమోదు చేసింది. ఈ మ్యాచ్‌లో రౌల్ జిమెనెజ్, జోహాన్ వాస్క్వెజ్, లూయిస్ చావెజ్ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. ముఖ్యంగా డిఫెన్స్, మిడ్‌ఫీల్డ్, ఫార్వర్డ్ లైన్ల మధ్య సమన్వయం మెక్సికో విజయానికి ప్రధాన కారణమైంది. ప్రపంచకప్ ప్రారంభానికి ముందు ఇలాంటి భారీ విజయం సాధించడం మెక్సికో జట్టుకు పెద్ద ఊరటనిచ్చింది. ప్రధాన కోచ్ జేవియర్ అగ్యిరే ఆధ్వర్యంలో జట్టు మంచి లయలో ఉందని ఈ మ్యాచ్ మరోసారి నిరూపించింది. ప్రపంచకప్ తొలి మ్యాచ్‌లో దక్షిణాఫ్రికాతో తలపడనున్న మెక్సికో జట్టు ఈ విజయంతో మరింత ఆత్మవిశ్వాసంతో బరిలోకి దిగనుంది.






# పెద్ది బాక్సాఫ్ కలెక్షన్ల సునామీ

## తొలిరోజే రూ.135.36 కోట్లు వసూలు

## బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల

ఆటలోనూ, పోరాటంలోనూ ఛాంపియన్ అనిపించుకున్నాడు 'పెద్ది'. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన ఈ సినిమా తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి హిట్‌గా నిలిచింది. పెద్దిగా రామ్ చరణ్ తన నటనతో మెప్పిస్తుండగా.. చాలా రోజుల తర్వాత ఆయన ఖాతాలో హిట్ పడిందంటూ అభిమానులు సంబరాలు చేసుకుంటున్నారు. ఈ సినిమా మొదటి రోజు కలెక్షన్స్‌ను నిర్మాణ సంస్థ తాజాగా వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఫస్ట్‌డే రూ.135.36 కోట్లు వసూలుచేసినట్లు అధికారికంగా ప్రకటించింది. 'బాక్సాఫీస్ ఛాంపియన్' అంటూ పోస్టర్ విడుదల చేసింది. 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద తొలిరోజే కలెక్షన్ల సునామీ సృష్టించింది. గురువారం ప్రపంచవ్యాప్తంగా అత్యంత భారీ స్థాయిలో విడుదలైన ఈ చిత్రం మొదటి రోజే ఏకంగా రూ. 135.36 కోట్ల గ్రాస్ వసూలు చేసి సరికొత్త రికార్డులను సృష్టించినట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ అద్భుతమైన ఓపెనింగ్స్‌తో భారతీయ చిత్ర పరిశ్రమలో సరికొత్త సంచలనం సృష్టించింది. ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం.. ఈ చిత్రం ఇండియాలో గురువారం నాడు సుమారు రూ. 51 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించగా, బుధవారం నాటి పెయిడ్ ప్రివ్యూల ద్వారా మరో రూ. 18.50 కోట్లు రాబట్టింది. దీనితో మొత్తంగా ఇండియా నెట్ కలెక్షన్ రూ. 69.50 కోట్లకు చేరింది. ఇక ఇండియా గ్రాస్ కలెక్షన్ దాదాపు రూ. 82.49 కోట్లుగా నమోదు కాగా, ఓవర్సీస్ గ్రాస్ సుమారు రూ. 30 కోట్లుగా ఉంది. మరోవైపు వర్కింగ్ డే అయినప్పటికీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలోని థియేటర్లలో దాదాపు 68 శాతం ఆక్యుపెన్సీతో ప్రేక్షకులు థియేటర్లకు బారులు తీరారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, జియో స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో రామ్ చరణ్ సరసన జాన్వీ కపూర్ కథానాయికగా నటించగా, కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బొమన్ ఇరానీ, జగపతి బాబు, దివ్యేందు ముఖ్య పాత్రలు పోషించారు. ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందించిన అద్భుతమైన సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. రామ్ చరణ్ అభిమానులతో పాటు సాధారణ ప్రేక్షకులు కూడా ఈ చిత్రానికి బ్రహ్మరథం పడుతుండటంతో, వీకెండ్ ముగిసే సరికి ఈ కలెక్షన్ల జోరు మరిన్ని రికార్డులను తిరగరాయడం ఖాయమని ట్రేడ్ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. విజయనగరం జిల్లాలోని కొండ కింద ఊరు అది. వందల మంది జీవనం సాగిస్తున్నా, ప్రభుత్వ రికార్డుల్లో ఆ ఊరికి గుర్తింపు అన్నదే ఉండదు. అందుకే ఆ ఊరు అన్నా, అక్కడి నుంచి వచ్చిన మనుషులన్నా అందరికీ చిన్న చూపు. ఆ ఊళ్లో పుట్టి పెరిగినవాడే పెద్ది (రామ్‌చరణ్). రోజూ విజయనగరం వెళ్లి కూలి పనులు చేసుకుంటుంటాడు. పేరుకి కూలి అయినా క్రికెట్‌లో మాత్రం రాటుదేలిన ఆటగాడు. అందుకే విజయనగరం, బొబ్బిలి క్రికెట్ జట్లు వేలంలో పెద్దిని కొనేందుకు పోటీపడుతుంటారు. అలాంటి ఆటగాడు క్రికెట్‌ని వదిలి కుస్తీ క్రీడాకారుడిగా ఎందుకు మారాల్సివచ్చింది? పెద్ది ప్రయాణంపై అప్పలసూరి (జగపతిబాబు), గౌర్‌నాయుడు (శివరాజ్‌కుమార్) ఎలాంటి ప్రభావం చూపించారు? ఈ కథలో అచ్చియమ్మ (జాన్వీ కపూర్) ఎవరు? అనేది సినిమా చూసి తెలుసుకోవాలి.

# పెద్దిలో జాన్వీ పాత్రపై విమర్శలు

## సరైన ప్రాధాన్యం లేదంటూ సోషల మీడియా పోస్ట్

## జాన్వీ లైక్ కొట్టడంతో మరింత దుమారం

నటి జాన్వీకపూర్ ఒక ఇన్‌స్టా పోస్ట్‌కు చేసిన లైక్ ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు దర్శకత్వంలో తెరకెక్కిన 'పెద్ది' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. దీనికి సంబంధించి ఇన్‌స్టాలో ఓ పేజ్ పెట్టిన రివ్యూను జాన్వీకపూర్ లైక్ చేశారు. అయితే ఆ రివ్యూలో జాన్వీకపూర్ పాత్రకు సరైన ప్రాధాన్యం దక్కలేదని రాశారు. 'పెద్ది: భారతీయ సినిమా చరిత్రలో ఒక కథానాయికకి జరిగిన అత్యంత అవమానం' అని హెడ్డింగ్ పెట్టారు. దీన్ని జాన్వీ లైక్ చేయడం ఒక్కసారిగా హాట్ టాపిక్‌గా మారింది. తన పాత్రకు ప్రాధాన్యం దక్కలేదని జాన్వీ స్వయంగా సమర్థించారని కొందరు అంటుంటే.. పొరపాటున కొట్టి ఉంటారని మరికొందరు భావిస్తున్నారు. ఈ వార్తలు రావడంతో జాన్వీ ఆ పోస్ట్‌ను అన్‌లైక్ చేశారు. అయితే ఈలోపే దీనికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌లు నెట్టింట ప్రత్యక్షమయ్యాయి. రూ.350 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ 'అచ్చియమ్మ' పాత్రలో కనిపించిన విషయం తెలిసిందే. ఇక భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు కలెక్షన్లలో జోరు చూపించింది. మొదటి రోజు ప్రీమియర్స్‌తో కలిపి రూ .135 కోట్లు వసూలు చేసింది.



# షార్ట్ ఫిల్మ్‌ల నుంచి వెండితెరకు..

## ప్రియాంక జవాల్కర్ ప్రయాణం



హైదరాబాద్, జూన్ 5 :సినీ పరిశ్రమలో అవకాశాల కోసం ఎన్నో కలలతో అడుగుపెట్టే యువతుల్లో కొందరే తమ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు సంపాదిస్తారు. అలాంటి వారిలో నటి ప్రియాంక జవాల్కర్ ఒకరు. షార్ట్ ఫిల్మ్‌లతో తన నటనా ప్రతిభను నిరూపించుకుని, అనంతరం తెలుగు సినీ పరిశ్రమలో కథానాయికగా అవకాశాలు అందుకుని ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నారు. సినిమాల్లోకి రాకముందు ప్రియాంక జవాల్కర్ అనేక షార్ట్ ఫిల్మ్‌లలో నటించారు. తన సహజమైన నటన, ఆకట్టుకునే అభినయంతో దర్శక నిర్మాతల దృష్టిని ఆకర్షించారు. ఈ క్రమంలో ఆమెకు తెలుగు సినిమాల్లో అవకాశాలు రావడం ప్రారంభమైంది. తొలి అవకాశంతోనే ప్రముఖ హీరో సరసన నటించే అవకాశం దక్కడం ఆమె సినీ ప్రయాణంలో కీలక మలుపుగా మారింది. విజయ్ దేవరకొండ హీరోగా తెరకెక్కిన టాక్సీవాలా చిత్రంలో కథానాయికగా నటించిన ప్రియాంక జవాల్కర్ మొదటి సినిమాతోనే మంచి విజయాన్ని అందుకున్నారు. ఈ చిత్రం వాణిజ్యపరంగా విజయవంతం కావడంతో పాటు ప్రియాంకకు నటిగా మంచి గుర్తింపును తీసుకొచ్చింది. ఆమె అందం, అభినయం, తెరపై కనిపించిన తీరు ప్రేక్షకులను ఆకట్టుకోవడంతో వరుస అవకాశాలు లభించాయి. ఆ తర్వాత తిమ్మరుసు, ఎస్ఆర్ కళ్యాణమండపం, గమనం వంటి చిత్రాల్లో నటించి తన నటనతో మెప్పించారు. ముఖ్యంగా ఎస్ఆర్ కళ్యాణమండపం చిత్రం విజయంతో ఆమెకు మరింత గుర్తింపు లభించింది. విభిన్నమైన పాత్రలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక స్థానాన్ని ఏర్పరుచుకునేందుకు ప్రయత్నించారు. ప్రస్తుతం పెద్దగా సినిమాల్లో కనిపించకపోయినా, ప్రియాంక జవాల్కర్ సామాజిక మాధ్యమాల్లో మాత్రం చురుకుగా ఉ ంటున్నారు. తరచూ ఫొటోలు, వ్యక్తిగత విషయాలు, ఫ్యాషన్‌కు సంబంధించిన చిత్రాలను అభిమానులతో పంచుకుంటూ సోషల్ మీడియాలో మంచి ఆదరణ పొందుతున్నారు. ఆమె పంచుకునే చిత్రాలు నెటిజన్ల దృష్టిని ఆకర్షిస్తూ వైరల్ అవుతున్నాయి. సినిమాల్లో అవకాశాల కోసం షార్ట్ ఫిల్మ్‌లను వేదికగా చేసుకుని విజయవంతమైన నటిగా ఎదిగిన ప్రియాంక జవాల్కర్, భవిష్యత్తులో మరిన్ని మంచి కథలతో ప్రేక్షకుల ముందుకు రావాలని అభిమానులు ఆశిస్తున్నారు. సరైన కథలు, పాత్రల కోసం ఎదురుచూస్తున్న ఆమె మరోసారి విజయవంతమైన చిత్రంతో తెరపై సందడి చేయాలని సినీ వర్గాలు భావిస్తున్నాయి.



# 'దూత 2' ప్రారంభం..

## ఓదెల-2పై శర్వానంద్ ఆసక్తికర కామెంట్స్

అక్కినేని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'దూత' వెబ్ సిరీస్ రెండో భాగం అధికారికంగా ప్రారంభమైంది. తొలి భాగంతో విశేష ఆదరణ పొందిన ఈ అతీంద్రియ ఉత్కంఠభరిత కథా ధారావాహికకు కొనసాగింపుగా రూపొందుతున్న 'దూత 2' పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లోని అన్నపూర్ణ స్టూడియోస్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అక్కినేని నాగార్జున ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ కొట్టి చిత్రబృందానికి శు భాకాంక్షలు తెలిపారు. 'దూత' తొలి భాగం విడుదలైన తర్వాత ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించింది. ఉత్కంఠభరిత కథనం, అనూహ్య మలుపులు, భావోద్వేగ సన్నివేశాలతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సిరీస్‌కు ఇప్పుడు రెండో భాగం రూపుదిద్దుకోవడం అభిమానుల్లో మరింత ఆసక్తిని పెంచుతోంది. మొదటి భాగం ముగిసిన తీరు చూసిన ప్రేక్షకులు తదుపరి కథ ఎలా ఉండబోతోందనే ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. ఈ సిరీస్ ద్వారా అక్కినేని నాగచైతన్య తన సినీ ప్రయాణంలో మరో కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నారు. నటుడిగా ఇప్పటికే గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు నిర్మాతగా కూడా బాధ్యతలు చేపట్టడం విశేషంగా మారింది. అన్నపూర్ణ స్టూడియోస్‌తో పాటు ప్రముఖ నిర్మాత శరత్ మరార్ సంస్థతో కలిసి నాగచైతన్య ఈ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. నిర్మాతగా తన తొలి అడుగు 'దూత 2'తో పడుతుండటం తనకు ఎంతో ఆనందంగా ఉందని నాగచైతన్య పేర్కొన్నారు. సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించిన నాగచైతన్య, 'దూత' రెండో అధ్యాయం ప్రారంభమవుతున్న ఈ సందర్భంగా తనకు ఎంతో ప్రత్యేకమైన అనుభూతి కలుగుతోందన్నారు. నటుడిగా మాత్రమే కాకుండా నిర్మాతగా కూడా కొత్త బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందని, ప్రేక్షకులకు మరింత మెరుగైన కథను అందించేందుకు బృందం కృషి చేస్తోందని తెలిపారు. మొదటి భాగాన్ని ఆదరించిన ప్రేక్షకులకు ఈసారి మరింత ఉత్కంఠ, వినోదం అందించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. మొదటి భాగానికి దర్శకత్వం వహించి ప్రశంసలు అందుకున్న దర్శకుడు విక్రమ్ కె కుమార్ ఈ రెండో భాగానికీ దర్శకత్వ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కథనం, పాత్రల రూపకల్పన, ఉత్కంఠభరిత మలుపులతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఆయన నుంచి మరోసారి ఆసక్తికరమైన కథనం రాబోతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి. మొదటి భాగంలో కీలక పాత్రలు పోషించిన పార్వతి తిరువోతు, ప్రియా భవానీ శంకర్ ఈ సీక్వెల్‌లో కూడా తమ పాత్రలను కొనసాగిస్తున్నారు. వీరితో పాటు మరికొంతమంది ప్రముఖ నటీనటులు కూడా ఈ సిరీస్‌లో కనిపించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే వారి వివరాలను చిత్రబృందం ఇంకా అధికారికంగా వెల్లడించలేదు. ఈ సిరీస్‌కు ఇషాన్ ఛాబ్రా సంగీతం అందిస్తుండగా, ముఖేష్ ఛాయాగ్రహణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. నిర్మాణ పర్యవేక్షణలో పద్మాకర్, ప్రవళ్య, అనూష పుంజాల తదితరులు కీలక పాత్ర పోషిస్తున్నారు. సాంకేతికంగా మరింత ఉన్నత ప్రమాణాలతో రెండో భాగాన్ని రూపొందించేందుకు బృందం సన్నాహాలు చేస్తోంది. తొలి భాగం సాధించిన విజయాన్ని దృష్టిలో ఉంచుకుని 'దూత 2'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. కథలో కొత్త మలుపులు, మరింత ఉ త్కంఠభరితమైన సంఘటనలు, బలమైన పాత్రలతో ఈ సిరీస్ ప్రేక్షకులను మరోసారి అలరించేందుకు సిద్ధమవుతోంది. అక్కినేని అభిమానులతో పాటు వెబ్ సిరీస్‌లను ఆసక్తిగా వీక్షించే ప్రేక్షకులు కూడా 'దూత 2' కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.




Printed, Published and Owned by **RAVU RAJITHA,** Printed at **KAKATHIYA PRINTERS,** LN Colony, Uppal IDA, Uppal. **Editor: RAVU NAGI REDDY. RAJAMUDRA PUBLICATIONS,** Peerzadiguda, Medchal - Malkajigiri Dist. Telangana - 98, **RNI NO : TELTEL/2024/86684,** Contact No :98484 83466 9182474575, MAIL ID: rajaamudranews@gmail.com